www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229




సంపుటి : 17 | సంచిక : 206 | శుక్రవారం 25.09.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

# ప్రభుత్వం సంచలన నిర్ణయం

**భూముల అక్రమాలపై కమిటీకి ఫుల్ పవర్స్**

**కేసీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్యనేతల భూములపై...**

22ఏ భూముల వ్యవహారంపై విచారణ షురూ

మాజీ నేతల భూములపై సర్కార్ దర్యాప్తు

పలు జిల్లాల్లో భూములపై సర్కార్ ఫోకస్



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న 22ఏ భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇటీవల రాష్ట్ర శాసనసభలో 22ఏ భూముల అంశంపై చర్చ నేపథ్యంలో మాజీ ముఖ్యంత్రి కేసీఆర్‌తో పాటు పలువురు మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, వారి బంధువులు, అనుచరులు, వివిధ సంస్థలకు చెందిన భూములపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లోని పలు గ్రామాల్లో భూముల అక్రమాలు, అవకతవకలు, చట్టాల ఉల్లంఘనలపై విచారణ జరపాలని సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేన చైర్ పర్సన్‌గా, ఐఏఎస్ రాజీవ్ హనుమంతు కన్వీనర్‌గా, ఐఏఎస్ సందీప్ కుమార్ ఝా సభ్యుడిగా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ సంజయ్ జాజు జీవో నంబర్ 134 ను జారీ చేశారు.

- 22ఏ భూములపై తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం
- 22ఏ భూముల అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ
- కేసీఆర్ సహా పలువురి భూములపై విచారణ
- 22ఏ భూములపై దేవసేన కమిటీ ఏర్పాటు
- భూముల అక్రమాలపై కమిటీకి ఫుల్ పవర్స్
- పలు జిల్లాల్లో భూములపై సర్కార్ ఫోకస్ 03
- 22ఏ భూముల వ్యవహారంపై విచారణ షురూ
- మాజీ నేతల భూములపై సర్కార్ దర్యాప్తు
- భూ అక్రమాలపై కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం
- 22ఏ భూములపై సమగ్ర విచారణకు కమిటీ

**అసైన్డ్, భూదాన్ భూములపైనా దర్యాప్తు ధరణి రికార్డులపై కమిటీ ఆరా**



## మా లక్ష్యం దేశ నిర్మాణమే..

**వికసిత్ భారత్ సృష్టికర్తలు యువతే**

- వికసిత్ భారత్ లక్ష్యం..యువతే శక్తి
- దేశ నిర్మాణమే పరమావధి: మోదీ
- 2047 నాటికి వికసిత్ భారత్: మోదీ
- యువతతోనే నవ భారత నిర్మాణం
- దేశ సేవే లక్ష్యం.. వికసిత్ భారత్ గమ్యం
- యువశక్తితో వికసిత్ భారత్ వైపు
- దేశాన్ని క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోండి: మోదీ 02

# దానంకు సుప్రీంకోర్టులో చుక్కెదురు..

**హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు..!**

ఎమ్మెల్యే అనర్హతపై హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు..



- దానం నాగేందర్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ
- దానం అనర్హతపై సుప్రీం కీలక తీర్పు
- దానం పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం
- హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం
- పదో షెడ్యూల్‌పై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- దానం అనర్హతపై సుప్రీం స్పష్టత
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే అనర్హతకు మద్దతు
- దానం కేసులో సుప్రీం తీర్పు
- ఫిరాయింపుల చట్టంపై సుప్రీం కీలక వ్యాఖ్యలు
- దానం నాగేందర్ పిటిషన్ డిస్మిస్ 02



## ఎన్నికలకు సిద్ధం అవుతా

న్యాయపోరాటం ముగిసింది.. ప్రజాక్షేత్రంలోకి ఖైరతాబాద్ ప్రజల ఆశీస్సులు నాకే: దానం 03



## మెట్రో టైమింగ్స్ మార్పు.!

- గణేష్ నిమజ్జనానికి మెట్రో సేవలు పొడిగింపు
- భక్తుల కోసం అర్ధరాత్రి వరకు మెట్రో
- నిమజ్జన వేళ భక్తులకు మెట్రో గుడ్‌న్యూస్
- సెప్టెంబర్ 25న ఒంటి గంట వరకు మెట్రో
- నిమజ్జనానికి మెట్రో సేవల వేళల పెంపు
- భక్తుల సౌకర్యార్థం మెట్రో కీలక నిర్ణయం 02

**ట్రాఫిక్ కష్టాలకు మెట్రోనే ప్రత్యామ్నాయం**

## 48 గంటల్లో సీఈసీ రాజీనామా చేయాలి..

- జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్
- సీఈసీ రాజీనామా చేయాలన్న సీజేపీ
- రాజీనామా చేయకుంటే దేశవ్యాప్త ఆందోళన
- సీఈసీపై సీజేపీ కీలక డిమాండ్లు 03
- రాబోయే ఎన్నికలు నిలిపివేయాలని డిమాండ్

**ఎన్నికల కమిషన్‌పై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి**





## బీజేపీ విజయం ఖాయం

- ఖైరతాబాద్ ఉపఎన్నికపై కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- సుప్రీం తీర్పుతో ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు మార్గం?
- దానం నాగేందర్ కేసు.. సుప్రీం తీర్పుపై కిషన్ రెడ్డి హర్షం
- ఫిరాయింపుల రాజకీయాలకు సుప్రీం తీర్పు గుణపాఠం
- దానం నాగేందర్ కేసులో సుప్రీం తీర్పు..
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై కిషన్ రెడ్డి విమర్శలు

03

## డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులో బిగ్ ట్విస్ట్..

**బినామీల ఇండ్లపై రెయిడ్స్..** | **కట్టల కొద్దీ నగదు**



8 మంది బినామీల ఇళ్లపై ఏకకాలంలో ఏసీబీ సోదాలు

- భీమ్‌రెడ్డి కేసులో కీలక ఆధారాల కోసం సోదాలు
- బినామీ ఇంట్లో కట్టల నగదు కలకలం
- దేశీ, విదేశీ కరెన్సీ స్వాధీనం?
- భీమ్‌రెడ్డి ఆస్తుల కేసులో మరో కీలక మలుపు
- బినామీల ఆస్తులు, లావాదేవీలపై ఏసీబీ ఆరా
- అక్రమాస్తుల కేసులో ఏసీబీ దర్యాప్తు ముమ్మరం
- డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీలపై ఏసీబీ ఫోకస్ 05

# సజ్జనార్‌కు కౌశిక్ రెడ్డి హెచ్చరిక

- కేసీఆర్ పాటల వివాదం.. కౌశిక్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- నిమజ్జనం వేళ కేసీఆర్ పాటలపై రగడ
- సజ్జనార్ వ్యాఖ్యలపై కౌశిక్ రెడ్డి ఆగ్రహం
- దానం నాగేందర్‌పై సుప్రీం తీర్పు.. కౌశిక్ రెడ్డి స్పందన
- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కౌశిక్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ఖైరతాబాద్ ఉపఎన్నికపై కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు
- కాంగ్రెస్, బీజేపీలపై కౌశిక్ రెడ్డి విమర్శలు
- గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫైర్



హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. సజ్జనార్ తన నోరు అదుపులో పెట్టుకోవాలని, నిమజ్జనాల సందర్భంగా కేసీఆర్ పాటలు పెట్టడంపై నిషేధాలు విధించడానికి సజ్జనార్ ఎవరు? అని ప్రశ్నించారు. సజ్జనార్ ఏమైనా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారా? బ్రేక్ ఎపుడు చేయాలి, లంచ్ ఎపుడు చేయాలో కూడా ఆయనే చెబుతారా? అని నిలదీశారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కౌశిక్ రెడ్డి.. మేము అధికారంలోకి రావడం ఖాయం అని అప్పుడు సజ్జనార్ ఎక్కడున్నా వదిలిపెట్టేది లేదని సజ్జనార్ తాట తీస్తామని పరుష పదాలతో హెచ్చరించారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి కనీసం నీళ్లు వసతి కూడా ఇవ్వని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. హుజురాబాద్ నియోజకవర్గంలో నిమజ్జనం కోసం నీళ్లు ఇవ్వాలని మంత్రి నుంచి సెక్రటరీ దాకా కోరినా స్పందించలేదని, గణేష్ విగ్రహాలను ముక్కలు ముక్కలు చేసి నిమజ్జనం చేయడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్‌కు ఇక ఎందుకు ఓట్లేయాలని ఈ ప్రభుత్వం తీరు చూస్తుంటే రక్తం మరుగుతోందన్నారు. 02

# ఇక కోర్టులోనే.!

**'క్షుద్ర పూజల' ఆరోపణలపై కోర్టుకెక్కిన హరీశ్ రావు**

**రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు..** | **మూడేళ్లయినా డిప్యూటీ స్పీకర్ నియామకం లేదు..**




- మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై డీఫమేషన్ కేసు
- ఆధారాలతో నాంపల్లి కోర్టును ఆశ్రయించిన హరీశ్ రావు
- తప్పుడు ప్రచారాలపై న్యాయపోరాటం చేస్తామన్న హరీశ్ రావు 02

**అసత్య ప్రచారాలు చేస్తే వదిలేది లేదు.. న్యాయపోరాటం చేస్తాం**

# దానంకు సుప్రీంకోర్టులో చుక్కెదురు..

**ఢిల్లీ :** ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. భారత రాష్ట్ర సమితి నుంచి కాంగ్రెస్‌లోకి మారిన నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. భారత రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ (యాంటీ డిఫెక్షన్ చట్టం) కింద దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసే విషయంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పు చట్టాన్ని సరైన రీతిలో అర్థం చేసుకుని ఇచ్చిందని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. విచారణ సందర్భంగా జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీ సరదాగా వ్యాఖ్యానిస్తూ.. 2023లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. "మీకు ఎమ్మెల్యేగా ఒక ఫిక్స్‌డ్ డిపాజిట్ ఉంది. ఎంపీగా షేర్ మార్కెట్‌లో ప్రయత్నించారు. ఇప్పుడు ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను కూడా కోల్పోయారు" అని వ్యాఖ్యానించారు. అయితే దానం నాగేందర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్న సభ్యుడి చర్యను పార్టీ క్షమించే అవకాశం పదో షెడ్యూల్‌లో ఉందని ఆయన వాదించారు. పదో షెడ్యూల్‌లోని పేరా 2(1)(బి)ని ప్రస్తావించిన రోహత్గీ.. పార్టీ ఆదేశాలకు (విప్) విరుద్ధంగా ఓటు వేసిన సభ్యుడి చర్యను పార్టీ క్షమించే అవకాశం ఉందని తెలిపారు. అయితే ధర్మాసనం ఈ వాదనను తోసిపుచ్చింది. పేరా 2(1)(బి) నిబంధన కేవలం పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేయడం వంటి అంశాలకు మాత్రమే వర్తిస్తుందని, పార్టీ సభ్యత్వాన్ని వదులుకోవడానికి సంబంధించిన పేరా 2(1)(ఎ)కు అది వర్తించదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ బాగ్చీ మరోసారి సరదాగా వ్యాఖ్యానిస్తూ.. "మీ కేసు 'ఆయా రామ్, గయా రామ్, ఫిర్ ఆయా రామ్' లాంటిదా?" అని ప్రశ్నించారు. అయితే బీఆర్ఎస్ తరఫు న్యాయవాది దానం నాగేందర్ చర్యను పార్టీ క్షమించలేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్‌ను దాఖలు చేసింది కూడా బీఆర్ఎస్ సభ్యుడేనని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి కారణం లేదని స్పష్టం చేస్తూ దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టివేసింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూనే కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హతకు దారితీస్తుందని తెలంగాణ హైకోర్టు తేల్చింది. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను తిరస్కరించిన నిర్ణయాన్ని హైకోర్టు డివిజన్ బెంచ్ పక్కనపెట్టింది. చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన డివిజన్ బెంచ్ దానం నాగేందర్ అనర్హతకు గురైనట్లు పేర్కొంది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు పరిగణించి తాజా ఎన్నికకు మార్గం సుగమం అవుతుందని తెలిపింది. 2024 ఏప్రిల్ 23న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా దానం నాగేందర్ పోటీ చేసిన తేదీ నుంచే ఆయన అనర్హత అమల్లోకి వస్తుందని హైకోర్టు తన తీర్పులో పేర్కొంది. అనర్హత వేటు ఉత్తర్వులను అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తూ తాత్కాలికంగా నిలిపివేయాలన్న దానం నాగేందర్ తరఫు న్యాయవాది అభ్యర్థనను కూడా హైకోర్టు తిరస్కరించింది.

# సజ్జనార్‌కు కౌశిక్ రెడ్డి హెచ్చరిక

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. సజ్జనార్ తన నోరు అదుపులో పెట్టుకోవాలని, నిమజ్జనాల సందర్భంగా కేసీఆర్ పాటలు పెట్టడంపై నిషేధాలు విధించడానికి సజ్జనార్ ఎవరు? అని ప్రశ్నించారు. సజ్జనార్ ఏమైనా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారా? బ్రేక్ ఎపుడు చేయాలి, లంచ్ ఎపుడు చేయాలో కూడా ఆయనే చెబుతారా? అని నిలదీశారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కౌశిక్ రెడ్డి.. మేము అధికారంలోకి రావడం ఖాయం అని అప్పుడు సజ్జనార్ ఎక్కడున్నా వదిలిపెట్టేది లేదని సజ్జనార్ తాట తీస్తామని పరుష పదాలతో హెచ్చరించారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి కనీసం నీళ్లు వసతి కూడా ఇవ్వని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. హుజురాబాద్ నియోజకవర్గంలో నిమజ్జనం కోసం నీళ్లు ఇవ్వాలని మంత్రి నుంచి సెక్రటరీ దాకా కోరినా స్పందించలేదని, గణేష్ విగ్రహాలను ముక్కలు ముక్కలు చేసి నిమజ్జనం చేయడం బాధాకరం అన్నారు. కాంగ్రెస్‌కు ఇక ఎందుకు ఓట్లేయాలని ఈ ప్రభుత్వం తీరు చూస్తుంటే రక్తం మరుగుతోందన్నారు.

**రాహుల్ గాంధీకి సిగ్గు శరం లేదా?:**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విషయంలో హైకోర్టు, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులు అద్భుతం అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత కోసం 24 మార్చి 2024 నుంచి బీఆర్ఎస్ లీగల్ సెల్ పోరాడుతోందన్నారు. కాంగ్రెస్ బీజేపీలు కుమ్మక్కయ్యాయని, బీజేపీ వాళ్ళు మందికి పుట్టిన బిడ్డలు తమ బిడ్డలు అన్నట్టుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. మిగతా ఎనిమిది మంది పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో బీజేపీ ఎందుకు పోరాడలేదన్నారు. రెండున్నరేళ్ల మా పోరాటం తర్వాత దానంపై వేటు పడితే, సిగ్గు లేకుండా ఇపుడు తమ ఘనత అని బీజేపీ నేతలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. హైకోర్టు తీర్పు తర్వాత నాగేందర్ సుప్రీంకు వెళ్లనని చెప్పి మరుసటి రోజే మాట మార్చారని విమర్శించారు. కాంగ్రెస్ ఖైరతాబాద్‌లో ఓడిపోతుందని తెలిసే సుప్రీం కోర్టుకు వెళ్లారన్నారు. రేవంత్ రెడ్డికి ఎలాగు సిగ్గు శరం లేదు..రాహుల్ గాంధీకైనా లేదా? అంటూ ఘాటు వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీకి కూడా ఈ తీర్పు చెంపపెట్టు లాంటిదేనన్నారు. పార్టీ మారిన మిగతా ఎనిమిది మంది పై కూడా వేటు తప్పదని త్వరలోనే ఆ ఎనిమిది నియోజకవర్గాల్లో కూడా ఉప ఎన్నికలు వస్తాయన్నారు. ఖై-రతాబాద్‌లో 22- ఏ ప్రభావం ఉంటుందన్నారు. నిరుద్యోగులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పని చేస్తారని పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇక జీవితంలో వార్డు మెంబర్లుగా కూడా గెలవరన్నారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద రాజకీయ వేడి



**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:**

దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వేదికగా నల్గొండ జిల్లా రాజకీయాలు వేడెక్కాయి. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నిర్వహించిన ప్రెస్‌మీట్‌కు కౌంటర్‌గా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గురువారం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో బినామీ కాంట్రాక్టులు, కమిషన్ల పేరుతో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేటీఆర్ కుటుంబానికి ఏటీఎంగా మారిందని ఆరోపించిన ఆయన, యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావులకు ఏటీఎంగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బొగ్గు అందుబాటులో లేని ప్రాంతంలో పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం వల్ల దూర ప్రాంతాల నుంచి బొగ్గును తరలించాల్సి వస్తోందని, దీంతో అదనపు ఆర్థిక భారం పడుతోందని ఎమ్మెల్యే ఆరోపించారు. అభివృద్ధి పేరుతో పార్టీ ఫిరాయింపులకు పాల్పడి, పవర్ ప్లాంట్ నిర్మాణంలో కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. పవర్ ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు గత పాలనలో అన్యాయం జరిగిందని బత్తుల లక్ష్మారెడ్డి ఆరోపించారు. స్థానిక భూనిర్వాసితుల ప్రయోజనాలను పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇప్పించుకున్నారని విమర్శించారు. గతంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తున్న వ్యక్తులు ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని పవర్ ప్లాంట్ సందర్శనకు వచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకెళుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నిర్మాణంలో ఉన్న నాలుగు యూనిట్లను పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని, త్వరలో ఐదో యూనిట్‌ను కూడా ప్రారంభించే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. పవర్ ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు అండగా నిలిచి, అర్హత మేరకు ఉద్యోగాలు కల్పించేలా తన వంతు కృషి చేస్తానని బత్తుల లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతానని, గతంలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవినీతి, అక్రమాల అంశాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భూనిర్వాసితులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మా లక్ష్యం దేశ నిర్మాణమే..

**ఢిల్లీ :** రాజకీయాలు, ఎన్నికలు, పాలనా వ్యవస్థలు వాటి స్థానంలో అవి ఉంటాయని, కానీ తాము దేశ నిర్మాణమే పరమావధిగా 'వికసిత్ భారత్' సంకల్పంతో ముందడుగు వేస్తున్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా 'సేవా యాత్ర' ప్రతినిధులతో ఆయన ముచ్చటించారు. సేవా భావం ఉన్నప్పుడే దేశంలోని కోట్లాది మంది నిరుపేదలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతాయని, పేదల ఆరోగ్య రక్షణ కోసం ఆయుష్మాన్ భారత్ వంటి విప్లవాత్మక పథకాలు పురుడుపోసుకుంటాయని ప్రధాని పేర్కొన్నారు. సేవా సంకల్పంతో చేపట్టిన కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పులు తెచ్చాయో యాత్రలో పాల్గొంటున్న యువత ప్రత్యక్షంగా గమనించవచ్చని ఆయన వివరించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ (వికసిత్ భారత్) నిర్మాణంలో యువశక్తి పాత్ర అత్యంత కీలకమని ప్రధాని నొక్కిచెప్పారు. నేటి యువతరమే నవ భారతానికి అసలైన సృష్టికర్తలని, భవిష్యత్ ఫలాలను అందుకునే అతిపెద్ద లబ్ధిదారులు కూడా వారేనని గుర్తుచేశారు. ఈ మహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలంటే దేశాన్ని క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవడం, భిన్న ప్రాంతాలు, విభిన్న వర్గాల ప్రజలను కలిసి వారి కలలు, ఆకాంక్షలను తెలుసుకోవడం ఎంతో అవసరమని సూచించారు. దేశ వాస్తవ పరిస్థితులను ప్రతి కోణంలోనూ అధ్యయనం చేసేందుకు ఈ 'సేవా సంకల్ప యాత్ర' ప్రతి ఒక్కరి జీవితంలో ఒక గొప్ప మార్గదర్శకంగా నిలుస్తుందని ప్రధాని మోదీ యువతకు దిశానిర్దేశం చేశారు.



## ధాన్యం విక్రయించాలంటే 'ఫార్మర్ ఐడీ' తప్పనిసరి !

**నాగిరెడ్డిపేట్,ఫ్లాష్ ఇండియా :** ధాన్యం కొనుగోలుకు ఫార్మర్ ఐడీ తప్పనిసరని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ కలిగి ఉంటేనే ధాన్యం కొనుగోలు అవుతుందని నాగిరెడ్డిపేట్ మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ తెలిపారు. గతంలో ప్రతి వానాకాలం, యాసంగి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పట్టా పాస్‌బుక్ ఆధారంగా కొనుగోలు చేశామని, ఇక వానాకాలం ధాన్యం కొనాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఉంటేనే ధాన్యం కొనుగోలు అవుతుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకొని ఫార్మర్ ఐడీని పొందాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులు ఆయా గ్రామాల ఏఈవోలను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడీ పొందాలని సూచించారు. మండలంలో మొత్తం 14,486 మంది రైతులకు గాను 11,263 మంది రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, మిగతా రైతులు కూడా తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు నంబర్, పట్టాదార్ పాస్‌బుక్ వివరాలు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకెళ్లాలని తెలిపారు.

# మెట్రో టైమింగ్స్ మార్పు.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో నగర మెట్రో రైలు సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల సౌకర్యార్థం సెప్టెంబర్ 25న హైదరాబాద్ మెట్రో రైలు సేవలను సెప్టెంబర్ 26వ తేదీ తెల్లవారుజామున 1 గంట వరకు పొడిగించింది. దీంతో నిమజ్జన వేడుకలకు వెళ్లే భక్తులు రాత్రివేళ కూడా మెట్రో సేవలను వినియోగించుకోవచ్చు. సెప్టెంబర్ 25న అన్ని టెర్మినల్ స్టేషన్ల నుంచి చివరి మెట్రో రైలు తెల్లవారుజామున 1:00 గంటలకు బయలుదేరుతుందని మెట్రో అధికారులు వెల్లడించారు. నిమజ్జనం సందర్భంగా నగరంలోని ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ ఆంక్షలు, భారీ రద్దీ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు శోభాయాత్రగా హుస్సేన్ సాగర్ వైపు తరలివస్తాయి. ఖైరతాబాద్ మహాగణపతితో పాటు వేలాది విగ్రహాల నిమజ్జనాన్ని వీక్షించేందుకు నగరవాసులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు నగరానికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ, వాహనాల రాకపోకలపై ఆంక్షలు, పార్కింగ్ సమస్యలు తలెత్తే అవకాశం లేకుండా.. సొంత వాహనాల్లో వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుండా మెట్రో సేవలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఇక కోర్టులోనే.!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ నాయకులు తనపై చేసిన అసత్య ప్రచారాలను నిరసిస్తూ బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి హరీశ్ రావు కోర్టులో డీఫమేషన్ కేసు ఫైల్ చేశారు. తాను క్షుద్ర పూజలు చేశానంటూ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ తీవ్ర ఆరోపణలు చేశారని, ఇవన్నీ పూర్తిగా ఆధారరహితమైన అబద్ధాలని ఆయన మండిపడ్డారు. అన్ని సాక్ష్యాధారాలతో కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం తన పిటిషన్‌ను స్వీకరించిందని, ఈ నెల 30వ తేదీ బుధవారం నాడు తన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయనున్నట్లు హరీశ్ రావు వెల్లడించారు.

**అసత్య ప్రచారాలు చేస్తే వదిలేది లేదు..**

**న్యాయపోరాటం చేస్తాం**

హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు తన వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చేలా బాధ్యతారాహిత్యంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, అద్దంకి దయాకర్ వంటి నాయకులు తనపై నిరంతరం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. భవిష్యత్తులో కూడా తనపై కానీ, తమ పార్టీపై కానీ ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల హామీలు నెరవేర్చలేక, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత , సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రకమైన 'డైవర్షన్ పాలిటిక్స్' కు పాల్పడుతోందని ధ్వజమెత్తారు.

**రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు..**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గట్టి చెంపపెట్టు అని హరీశ్ రావు అభివర్ణించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒకవైపు రాజ్యాంగ సంరక్షకుడిగా మాట్లాడుతారని, మరి ఆయన సొంత పార్టీనే ఇతర పార్టీల ఎమ్మెల్యేలను అక్రమంగా చేర్చుకున్నప్పుడు ఆ రాజ్యాంగ సూత్రాలు ఏమయ్యాయని నిలదీశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు తర్వాతైనా పార్టీ మారిన శాసనసభ్యులకు కనువిప్పు కలగాలని ఆకాంక్షించారు. రాహుల్ గాంధీకి నిజంగా రాజ్యాంగంపై గౌరవం ఉంటే, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలందరి చేత వెంటనే రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. దానం నాగేందర్‌కు ఎదురైన పరిస్థితే మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేలందరికీ ఎదురవు-తుందని స్పష్టం చేశారు.

**మూడేళ్లయినా డిప్యూటీ స్పీకర్ నియామకం లేదు..**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా ఇంతవరకు అసెంబ్లీకి డిప్యూటీ స్పీకర్ నియామకం చేపట్టకపోవడం వారి బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. సభ హక్కుల ఉల్లంఘనపై బీఆర్ఎస్ తరఫున నోటీసులు ఇచ్చినప్పటికీ స్పీకర్ పట్టించుకునే పరిస్థితి లేదని, పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడేందుకే స్పీకర్ వ్యవస్థను ఉపయోగించుకోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీల అమలును పూర్తిగా గాలికి వదిలేసి ప్రజలను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను తెలంగాణ ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని హరీశ్ రావు తేల్చిచెప్పారు.



# జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహి

**ఢిల్లీ :** ఎన్నికల సంఘం విధివిధానాలపై గత 10 నెలల్లో ఇద్దరు కమిషనర్లు 14 సార్లు తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తారని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక వెలువడంతో రాజకీయ దుమారం చెలరేగింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఈ విషయంపై గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను దేశద్రోహిగా అభివర్ణిస్తూ.. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల చోరీతో ప్రజాస్వామ్యం బలహీనమవుతోందని, నియంతృత్వం ఉన్న చోట అధికార వ్యతిరేకత ఉండదని, దేశ రాజ్యాంగం నాశనం అవుతోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. తాను ఊరికే ఆరోపణలు చేయడం లేదని, సాక్ష్యాధారాలతో నిరూపించానని ఆయన అన్నారు. ఎన్నికల్లో 100 శాతం అక్రమాలు జరిగాయని ఆరోపించారు. జ్ఞానేష్ కుమార్ కుట్రదారుల్లో అగ్రస్థానంలో ఉన్నారని, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కూడా ఆయనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని, ఇప్పుడు తాను కూడా లేవనెత్తుతున్నానని వ్యాఖ్యానించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని, ఆయన దేశానికి విరుద్ధంగా పనిచేశారని, మా వద్ద దీనికి సంబంధించిన సమాచారం ఉందని, ఫలితాలు త్వరలోనే వెలువడుతాయని అన్నారు. రాబోయే ఆరు నెలల్లో మరింత స్పష్టంగా వివరాలు తెలుస్తాయని అన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# ప్రభుత్వం సంచలన నిర్ణయం

## కేసీఆర్ సహా బీఆర్ఎస్ ముఖ్యనేతల భూములపై...

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న 22ఏ భూముల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఇటీవల రాష్ట్ర శాసనసభలో 22ఏ భూముల అంశంపై చర్చ నేపథ్యంలో మాజీ ముఖ్యంత్రి కేసీఆర్‌తో పాటు పలువురు మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు, వారి బంధువులు, అనుచరులు, వివిధ సంస్థలకు చెందిన భూములపై విచారణకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లోని పలు గ్రామాల్లో భూముల అక్రమాలు, అవకతవకలు, చట్టాల ఉల్లంఘనలపై విచారణ జరపాలని సీనియర్ ఐఏఎస్ అధికారి దేవసేన చైర్ పర్సన్‌గా, ఐఏఎస్ రాజీవ్ హనుమంతు కన్వీనర్‌గా, ఐఏఎస్ సందీప్ కుమార్ ఝా సభ్యుడిగా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు సీఎస్ సంజయ్ జాజు జీవో నంబర్ 134 ను జారీ చేశారు. ఆయా జిల్లాల గ్రామాలకు సంబంధించిన అంశాల విచారణ సమ-యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.

**కమిటీకి ఫుల్ పవర్స్:**

సెప్టెంబర్ 16న తెలంగాణ శాసనసభలో 22ఏ అంశంపై జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భూములకు సంబంధించి తీవ్రమైన అక్రమాలు జరిగినట్లు అసెంబ్లీలో ప్రస్తావనకు వచ్చింది. వీటిపై తదుపరి పరిపాలనాపరమైన చర్యలు తీసుకోవడం అవసరమని భావించిన ప్రభుత్వం.. సమగ్ర విచారణ నిర్వహించి బాధ్యులను నిర్ణయించడంతో పాటు తగిన చర్యలు సిఫార్సు చేయడానికి ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రభుత్వ భూములు, సీలింగ్ మిగులు భూములు, అసైన్డ్ భూములు, జాగీర్ భూములు, భూదాన్ భూములు, ఇనాం భూములు, అటవీ భూములు, భూసేకరణ, పునరావాస భూములు, జలాశయాలు (వాటర్ బాడీస్), వాటి క్యాచ్‌మెంట్ ఏరియాలు, భూ రికార్డులపై విచారణ జరపనుంది. అక్రమాలకు పాల్పడిన వారి బాధ్యతను ఖరారు చేసి, చర్యలకు సిఫార్సు చేయాలని ఈ కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. ఈ విచారణ కోసం ఎలాంటి సమాచారం, డాక్యుమెంట్లు, డేటా, మానవ వనరులు లేదా రికార్డులనైనా సేకరించే అధికారాన్ని కమిటీకి ప్రభుత్వం కల్పించింది. ప్రభుత్వ శాఖలు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు కమిటీకి పూర్తి సహకారం అందించి, కోరిన సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఆదేశించింది. విచారణ పూర్తయిన తర్వాత కమిటీ త్వరితగతిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించనుంది. అవసరమని భావిస్తే మధ్యంతర నివేదికలను కూడా అందించవచ్చని జీవోలో పేర్కొంది.

**విచారణ కమిటీ పరిధిలోకి వచ్చే గ్రామాలు, నేతల పూర్తి జాబితా:**

సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లోని పలు గ్రామాలు మరియు భూముల అంశాలపై ప్రత్యేక కమిటీ లోతుగా విచారణ జరపనుంది.

**సిద్దిపేట జిల్లా:**

**కేసీఆర్ మరియు అనుచరుల భూములు:** మర్కూక్ మండలం పరిధిలోని ఎర్రవల్లి, మార్కుక్, శివారు వెంకటాపూర్ గ్రామాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వారి కుటుంబ సభ్యులు అనుచరులకు చెందిన భూములు. హరీష్ రావు భూములు (రంగనాయక సాగర్ వద్ద): చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలో రంగనాయక సాగర్ రిజర్వాయర్‌కు సమీపంలో మాజీ మంత్రి హరీశ్ రావు, వారి కుటుంబ సభ్యులు, అనుచరులకు ఉన్న భూములు.

**అసైన్డ్ భూముల కొనుగోలు:** కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో సర్వే నంబరు 271 లోని అసైన్డ్ భూమిని ఎం.హనుమంతరావు కొనుగోలు చేసిన అంశం

**మల్లన్న సాగర్ భూసేకరణ అక్రమాలు:** తొగుట మండల పరిధిలో మల్లన్న సాగర్ రిజర్వాయర్ భూసేకరణకు సంబంధించి (దివంగత మాజీ ఎమ్మెల్యే ఎస్.రామలింగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా) ఎటిగడ్డ కిష్టాపూర్, పల్లెపహాడ్, రాంపూర్, తుక్కాపూర్ గ్రామాల్లోని భూ కేటాయింపులు.

**రంగారెడ్డి జిల్లా:**

**కేటీఆర్ కుటుంబ సభ్యులు / శతభిష అగ్రో భూములు:** శంకర్ పల్లి మండలం జన్వాడ గ్రామంలో 'శతభిష అగ్రో' మరియు ఇతర కంపెనీల పేరిట మాజీ మంత్రి కేటీఆర్ కుటుంబ సభ్యులు, అనుచరులు కొనుగోలు చేసిన భూములు

**జగదీష్ రెడ్డి భూములు:** షాబాద్ మండలం మద్దూర్ గ్రామంలో మాజీ మంత్రి జి.జగదీశ్వర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు, అనుచరులకు చెందిన భూములు.

**హరీష్ రావు భూములు (మొయినాబాద్):** మొయినాబాద్ మండలం అజీజ్ నగర్ గ్రామంలో మాజీ మంత్రి టి.హరీష్ రావు, వారి కుటుంబ సభ్యుల భూములు

**రోహిత్ రెడ్డి అసైన్డ్ భూముల ఆక్రమణ:** మొయినాబాద్ మండలం అజీజ్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే పి.రోహిత్ రెడ్డి అసైన్డ్ భూములను కొనుగోలు చేసి ఆక్రమించారనే ఆరోపణలు

**గంగుల కమలాకర్ భూములు:** శంషాబాద్ మండలం బహదూర్ గూడలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఇతరులు ప్రభుత్వ భూములను అక్రమంగా కొనుగోలు చేసి ఆక్రమించారనే ఆరోపణలు

**పల్లా రాజేశ్వర్ రెడ్డి (భూదాన్ భూములు):** గండిపేట మండలం వట్టినాగులపల్లిలో మాజీ ఎమ్మెల్సే/ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఇతరులు భూదాన్ భూములను అక్రమంగా కొనుగోలు చేశారనే ఆరోపణలు.

**శంకర హిల్స్ భూములు:** గండిపేట మండలం వట్టినాగులపల్లి (శంకర హిల్స్) లో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఇతరులు అక్రమంగా భూములు కొనుగోలు చేశారనే అంశం.

**కందుకూర్ భూదాన్ భూములు:** కందుకూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలోని భూదాన్ భూముల కొనుగోలు అంశాలు.

**హైదరాబాద్ జిల్లా:**

**లీజు భూముల క్రమబద్ధీకరణ:** సికింద్రాబాద్ పరిధిలోని 'జీరా లాండ్స్' లో మాజీ ఎమ్మెల్సీ ఎల్విన్ స్టీఫెన్సన్‌కు చెందిన లీజు భూముల క్రమబద్ధీకరణ అంశం.

**మహబూబ్‌నగర్ జిల్లా:**

ధరణి పోర్టల్ దుర్వినియోగం: బాలానగర్ మండలం గుండేడ్ గ్రామంలో రాజ్ హైటెక్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాజ్ పౌల్ట్రీ & ప్లాంటేషన్, రాజ్ పౌల్ట్రీ & అగ్రికల్చర్ ఫార్మ్స్, మనవిహ బ్రీడర్స్ LLP (ఎం.హనుమంతరావు, ఎం. సుమన్, టి. మహేష్ రావు ప్రాతినిధ్యంలో) ద్వారా ధరణి పోర్టల్ మాడ్యూల్స్, నిబంధనల ఉల్లంఘనల అంశం.

**రాజన్న సిరిసిల్ల జిల్లా:**

**అసైన్డ్ & ప్రభుత్వ భూముల కేటాయింపులు:** సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల పరిధిలోని సర్దాపూర్, లక్ష్మీపూర్, తంగళ్లపల్లి గ్రామాల్లో అసైన్డ్ భూముల అక్రమ కొనుగోళ్లు, ప్రభుత్వ భూముల కేటాయింపులు.

**మిడ్ మానేరు నష్టపరిహారం/ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు:** బోయిన్‌పల్లి మండలంలోని మన్వాడ తదితర గ్రామాల్లో జోగినపల్లి రవీందర్ రావు, జె.సౌమ్యలకు సంబంధించి మిడ్ మానేరు (రాజ రాజేశ్వర) రిజర్వాయర్ పరిహారం, R&R ప్యాకేజీ పొందే ప్రక్రియలో జరిగిన అక్రమాలపై విచారణ.

# అమృతరాణి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది




**పెద్దపల్లి,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఇంజనీరింగ్ విద్యార్థిని అమృతరాణి మృతికి కారణమైన నిందితులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంటలోని అమృతరాణి కుటుంబాన్ని గురువారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝాతో కలిసి పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున మంజూరైన రూ.4.12 లక్షల పరిహారం పత్రాన్ని అందజేశారు. అమృతరాణి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా మరో రూ.4.12 లక్షల పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అమృతరాణిని ఈ నెల 13న పురుగుల మందు తాగించి హత్య చేసిన ఘటనలో నిందితులను పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేశారని మంత్రి తెలిపారు. కేసులో సమగ్ర దర్యాప్తు పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా పకడ్బందీగా చార్జిషీట్ దాఖలు చేయాలని రామగుండం సీపీని ఆదేశించారు. భవిష్యత్తులో పేదలు, దళితులు, మహిళలపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను కోరారు.

**బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఉద్యోగం**

ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ అమృతరాణి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చును తానే భరిస్తానని తెలిపారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ మహిళలపై వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ సింగరేణిలో దళితులపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ, మార్కెట్, సింగిల్ విండో చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల సర్పంచులు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 48 గంటల్లో సీఈసీ రాజీనామా చేయాలి..

**ఢిల్లీ :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసిందడి. ఆయన రాజీనామా చేయకపోతే దేశవ్యాప్ంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. రాబోయే అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేయాలని కూడా కాక్రోచ్ పార్టీ డిమాండ్ చేసింది. న్యూఢిల్లీ నిర్వహించిన మీడియా సమావేశంలో సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే మాట్లాడుతూ.. సీఈసీ రాజీనామా చేయకపోతే, ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేపడుతామని అన్నారు. సీజేపీ కో కన్వీనర్ సౌరవ్ దాస్ మూడు ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. సీఈసీ రాజీనామా చేయడంతో పాటు జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఆయనకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆరోపిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడం, రాబోయే అన్ని ఎన్నికలను తాత్కాలికంగా నిలిపివేయడం తమ డిమాండ్లని చెప్పారు. ఇదే సమ-యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ను 2025 నాటి ఓటర్ల జాబితా స్థితికి వెనక్కి తీసుకెళ్లాలని సీజేపీ డిమాండ్ చేసింది. ఎస్ఐఆర్ కు సంబంధించిన ఫైళ్లను సుప్రీంకోర్టు నేతృత్వంలోని కమిటీ ఆధీనంలో ఉంచాలని, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేసింది. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలు, చర్యలపై అభ్యంతరాలు తెలిపారని ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక వెల్లడించింది. అయితే, ఈ నివేదికను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఎస్ఐఆర్ సహా అన్ని నిర్ణయాలను పూర్తి కమిషన్ ఆమోదంతోనే ఏకగ్రీవంగా తీసుకున్నామని తెలిపింది. కమిషనర్లు చర్చల సమయంలో అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలు వ్యక్తం చేయడం సాధారణ అంతర్గత ప్రక్రియలో భాగమే అని ఈసీ స్పష్టం చేసింది.

## ప్రజలే గుణపాఠం చెప్పాలి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఫిరాయింపుల రాజకీయాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలోకి ఫిరాయించడం నైతికతకే మచ్చ అని ఆయన మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలకు సిగ్గు రాలేదని, ఆయా రామ్, గయా రామ్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ వ్యవహారంలో వాస్తవాలను కప్పిపుచ్చి కొన్ని మీడియా సంస్థలు తీర్పును వక్రీకరిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపుల రాజకీయాలను సమర్థిస్తూ ఎవరికి వారే తమ విజయంగా చెప్పుకోవడం వారి అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని, ఈ తీర్పు ఆ రెండు పార్టీలకు చెంపపెట్టు వంటిదని స్పష్టం చేశారు. ఈ అనైతిక రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యమని, నైతికతను మంటకలిపిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఆ ఎన్నికల్లో పోటీ చేసే అర్హతే లేదని తేల్చిచెప్పారు. హిందూ బంధువులు, ప్రజలంతా ఏకమై ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న ఈ రెండు పార్టీలను రాజకీయంగా నిమజ్జనం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ కూడా ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడకుండా ప్రజలే గట్టి గుణపాఠం చెప్పాలని, ఈ ఎన్నికల ద్వారా అలాంటి బలమైన సంకేతాలను పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికలకు సిద్ధం అవుతా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ శా-సనసభ సభ్యత్వ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును తాను పూర్తిగా స్వాగతిస్తున్నానని ఆయన తెలిపారు. చట్టపరమైన ప్రక్రియపై గౌరవంతోనే తాను న్యాయపోరాటం చేశానని, ఇకపై తన భవిష్యత్తును ప్రజా క్షేత్రంలోనే నిర్ణయించుకుంటానని స్పష్టం చేశారు. "కోర్టు తీర్పు ఈ విధంగా వస్తుందని నేను ముందే ఊహించాను. అయితే రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ నిబంధనల ప్రకారం లీగల్‌గా నాకు కొంత ఊరట లభిస్తుందని భావించాను. అందుకే చట్టబద్ధంగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేశాను" అని దానం పేర్కొన్నారు.

**ఉప ఎన్నికకు సిద్ధం..**

కోర్టు తీర్పుతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైన నేపథ్యంలో.. తాను ముందస్తుగానే ఎన్నికలకు సిద్ధవ-ఎవుతున్నట్లు ప్రకటించారు. ఖైరతాబాద్ ప్రజలతో నాకు దశాబ్దాలుగా ప్రత్యేకమైన సాన్నిహిత్యం, అనుబంధం ఉన్నాయి. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో ఎప్పుడూ తోడుగా ఉన్నాను. వచ్చే ఉప ఎన్నికల్లో ప్రజా క్షేత్రంలోకి వెళ్లి వారి ఆశీర్వాదం కోరతాను. ఖైరాతాబాద్ ప్రజల ఆశీస్సులు నాకే ఉంటాయనే పూర్తి నమ్మకం ఉంది అని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేస్తూ ఇటీవల తీర్పునిచ్చింది. హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించగా, నేడు విచారణ చేపట్టిన అత్యున్నత ధర్మాసనం ఆయన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ హైకోర్టు తీర్పును సమర్థించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం అధికారికంగా ఖాళీ కాగా, ఉప ఎన్నికి అనివార్యమైంది.

# పార్టీ ఫిరాయింపులపై సీపీఐ నారాయణ ఫైర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు రాజకీయాధికారం కోసం ఫిరాయింపులను ప్రోత్సహించే ప్రధాన పార్టీలన్నింటికీ కన్నువిప్పు కలగజేసే గుణపాఠమని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ అన్నారు. ఈ తీర్పును కేవలం ఒక్క దానం నాగేందరు మాత్రమే పరిమితమైన సమస్యగా చూడకూడదని.. ఫిరాయింపులకు పాల్పడే రాజకీయ సంస్కృతిపై పడిన చెంపపెట్టుగా భావించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న ఫిరాయింపుల రాజకీయాలపై నారాయణ పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**ఎవరు సిగ్గుపడాలి? ఎవరు గర్వపడాలి?**

దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు వచ్చాక.. ఇప్పుడు అసలు ఎవరు సిగ్గుపడాలి? ఎవరు గర్వపడాలి? ఫిరాయింపులను ప్రోత్సహించి, వేరే పార్టీ నేతలకు కండువాలు కప్పి రాజకీయ ఆశ్ర-యం కల్పించిన పార్టీలు ఈ రోజు ఆత్మపరిశీలన చేసుకోవాలి అని డిమాండ్ చేశారు. తీర్పు రాగానే బీజేపీ సంబరాలు చేసుకోవడాన్ని ఆయన తప్పుపట్టారు. లోక్‌సభ, రాజ్యసభలతో పాటు వివిధ రాష్ట్రాల్లో ఫిరాయింపులను ప్రోత్సహించిన చరిత్ర బీజేపీకి లేదా? అని ప్రశ్నించారు. ఈ విషయంలో బీజేపీ ఇప్పుడు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉంది అని ఎద్దేవా చేశారు.

**కాంగ్రెస్ మౌనం - బీఆర్ఎస్ వైఖరి..**

తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు జరిగినప్పుడు బీఆర్ఎస్ బాధితురాలిగా మాట్లాడుతోందని, కానీ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఏ విధంగా చేర్చుకుందో అందరికీ తెలుసన్నారు. ఫిరాయింపుల ప్రక్రియను ప్రోత్సహించిన ప్రధాన పార్టీలు తమ తప్పులను సరిదిద్దుకోకుండా, పరస-ఎరం ఆరోపణలు చేసుకోవడం 'నక్కల పెళ్లికి కుక్కల జాతర'లా ఉందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**అంతిమంగా ప్రజాస్వామ్యానికే నష్టం..**

నాయకుల, పార్టీల స్వార్థ రాజకీయం వల్ల చివరికి ప్రజాస్వామ్యమే తలవంచుకోవాల్సి వస్తోందని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. దానం నాగేందర్ కేసు తీర్పు దేశవ్యాప్తంగా ఒక నమూనాగా మారాలని నారాయణ ఆకాంక్షించారు. ఎన్నికల్లో ఒక పార్టీ గుర్తుపై గెలిచి, వేరే పార్టీలోకి మారితే తక్షణమే సభ్యత్వం రద్దయ్యేలా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేస్తూ చట్టసవరణలు చేయాలని, అప్పుడే ఈ అపచారానికి శాశ్వతంగా అడ్డుకట్ట పడుతుందని ఆయన డిమాండ్ చేశారు.

# బీజేపీ విజయం ఖాయం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు అని అభివర్ణించారు. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని అన్నారు. పార్టీ ఫిరాయింపునకు పాల్పడిన ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు గురువారం స్పందించింది. ఈ నేపథ్యంలో దీనిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. నాడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా మంత్రులను చేసిందని.. నేడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేను చేర్చుకుని కాంగ్రెస్ తమ పార్టీ తరఫున ఎంపీగా పోటీ చేయించిందని గుర్తు చేశారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఉప ఎన్నికలో బీజేపీ ఘనవిజయం ఖాయమని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. దానం నాగేందర్ పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యం అవుతుందని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని తెలిపారు. దీనిపై తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని.. దీన్ని సుప్రీంకోర్టు తాజాగా సమర్థించిందని అన్నారు. ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదని.. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఓ గుణపాఠమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఓ దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారని మండిపడ్డారు. ప్రజా తీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం అధికారంలోకి వచ్చాక అదే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఈ రెండు పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతుందని చెప్పారు. ప్రజా తీరు-ఎను తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాల రాస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని తెలిపారు. దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవి అనర్హత కారణంగా ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని పేర్కొన్నారు. ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు.. అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుందని అన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని వివరించారు. ఈ రెండు పార్టీల కుళ్లు రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పి.. ఖైరతాబాద్ అసెంబ్లీ ప్రజలు.. వచ్చే ఉప ఎన్నికలో బీజేపీకి పట్టంగట్టడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## సంపాదకీయం




# ఎవరి బలం ఎంత.?

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఎన్నికల సమరం తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఖమ్మం--వరంగల్--నల్గొండ, హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. ఓటర్ల నమోదు ప్రక్రియకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి సమీకరణాలపై దృష్టి సారించాయి. సాధారణ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల స్వభావం భిన్నంగా ఉంటుంది. ఇక్కడ కుల, ప్రాంతీయ, పార్టీ సమీకరణాలతో పాటు విద్యావంతుల సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగ నియామకాలు, ప్రభుత్వ పాలనపై అభిప్రాయం, అభ్యర్థి వ్యక్తిగత పరిచయం వంటి అంశాలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అందుకే ఈ రెండు స్థానాల ఎన్నికలు రాజకీయ పార్టీలకు కేవలం రెండు ఎమ్మెల్సీ సీట్ల పోటీగా కాకుండా, పట్టభద్రులలో తమకు ఉన్న రాజకీయ మద్దతును అంచనా వేసుకునే అవకాశంగా మారుతున్నాయి.అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీకి పట్టభద్రుల నియోజకవర్గాల్లో తన అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా ప్రభుత్వ విధానాలకు విద్యావంతుల వర్గం నుంచి మద్దతు ఉందనే రాజకీయ సందేశాన్ని బలపరిచే అవకాశం ఉంటుంది. అందుకే ఈసారి ముందుగానే అభ్యర్థులను ప్రకటించి క్షేత్రస్థాయిలో ప్రచారానికి ఎక్కువ సమయం కేటాయించాలనే ఆలోచన కాంగ్రెస్‌లో కనిపిస్తోంది. వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానానికి పటేల్ రమేశ్ రెడ్డి, డాక్టర్ లోకేష్ యాదవ్, గుత్తా అమిత్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి, పొంగులేటి ప్రసాద్ రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానానికి మన్నే జీవన్ రెడ్డి, సామా రామ్మోహన్ రెడ్డి, గౌరీ సతీష్, హర్షవర్ధన్ రెడ్డి, శివసేనారెడ్డి, బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి వంటి పేర్లు వినిపిస్తున్నాయి. ఈ పేర్లలో తుది ఎంపిక ఏ విధంగా జరుగుతుందనేది కాంగ్రెస్ అంతర్గత రాజకీయాల్లో కీలక అంశంగా మారనుంది. అభ్యర్థి వ్యక్తిగత బలం, సామాజిక సమీకరణం, పార్టీకి ఉన్న సంస్థాగత బలం, స్థానిక నేతల సమన్వయం వంటి అంశాలను పార్టీ నాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.ఇక ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికలను తేలికగా తీసుకోవడం లేదు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానానికి రాకేష్ రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నప్పటికీ, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానంలో అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ స్థానానికి బీసీ అభ్యర్థిని ఎంపిక చేయాలనే డిమాండ్ పార్టీ అంతర్గతంగా బలంగా వినిపిస్తున్న నేపథ్యంలో సామాజిక సమీకరణాలు బీఆర్ఎస్ నిర్ణయంలో కీలకంగా మారే అవకాశం ఉంది. కేటీఆర్, హరీశ్ రావు ఉమ్మడి జిల్లాల నేతలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తూ అభ్యర్థి ఎంపికపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. నాగేందర్ గౌడ్, కాసాని వీరేశ్ ముదిరాజ్, రవి యాదవ్, అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి, దేవీ ప్రసాద్ తదితరుల పేర్లు చర్చలో ఉన్నాయి. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉద్యోగ వర్గాల సమస్యలను ప్రధాన రాజకీయ అంశాలుగా మలచుకున్న అనుభవం బీఆర్ఎస్‌కు ఉంది. అయితే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆ పాత సమీకరణాలు ఎంతవరకు పునరావృతమవుతాయన్నది ఎన్నికల ఫలితాలకంటే ముందుగా చెప్పలేని అంశం.మరోవైపు బీజేపీ కూడా ఈ రెండు నియోజకవర్గాలను రాజకీయంగా విస్తరించుకునే వేదికగా చూస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం పార్టీకి ప్రాధాన్యత కలిగిన నియోజకవర్గంగా కనిపిస్తోంది. రాంచందర్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఓటర్ల నమోదు, అభ్యర్థుల ఎంపికపై చర్చలు జరిగినట్లు సమాచారం. పవన్ కుమార్ రెడ్డి, ఎన్వీ సుభాష్, సారంగుల అమర్‌నాథ్, ఎస్. మల్లారెడ్డి, గంగాపురం వెంకటరెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. నల్గొండ-వరంగల్-ఖమ్మం స్థానంపై మాత్రం బీజేపీ నుంచి అదే స్థాయిలో పోటీ ఆసక్తి కనిపించకపోయినా కాసం వెంకటేశ్వర్లు, ప్రేమేందర్ రెడ్డి, పుల్లారావు వంటి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే అభ్యర్థి ఎంపిక మాత్రమే కాకుండా ఓటర్లను పెద్ద సంఖ్యలో నమోదు చేయించడం, పోలింగ్ రోజున వారిని సమన్వయం చేయడం వంటి అంశాలు బీజేపీకి కూడా కీలకంగా మారనున్నాయి.ఇదే సమయంలో జనసేన రాజకీయ పరిణామాలు కూడా ఈ ఎన్నికల సమీకరణాలను మరింత ఆసక్తికరంగా మార్చుతున్నాయి. నల్గొండ-వరంగల్-ఖమ్మం స్థానానికి జనసేన అభ్యర్థిని ప్రకటించిన నేపథ్యంలో ఆ పార్టీ స్వతంత్రంగా పోటీ చేస్తుందా, లేక ఇతర రాజకీయ శక్తులకు మద్దతు ఇస్తుందా అనే చర్చ కొనసాగుతోంది. జనసేన తీసుకునే తుది నిర్ణయం ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీల మధ్య ఓట్ల విభజనపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే అది ఎంత మేరకు ప్రభావం చూపుతుందనేది అభ్యర్థుల తుది ఎంపిక, ఎన్నికల సమయానికి ఏర్పడే పొత్తులు, స్థానిక రాజకీయ పరిస్థితులు, ఓటర్ల స్పందనపై ఆధారపడి ఉంటుంది.ఈ ఎన్నికల్లో మరో ముఖ్యమైన అంశం ఓటర్ల నమోదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందే అర్హుల నమోదు ప్రక్రియ రాజకీయ పార్టీలకు అత్యంత కీలకం. గత ఎన్నికల్లో నమోదైన ఓటర్లతో పోలిస్తే కొత్తగా ఎంతమంది పట్టభద్రులు ఓటర్లుగా చేరతారు? వారిలో యువత శాతం ఎంత ఉంటుంది? నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు, విద్యా రంగానికి చెందిన వర్గాలు ఏ అంశాలను ప్రధానంగా పరిగణిస్తారు? వంటి ప్రశ్నలు ఎన్నికల రాజకీయాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందువల్ల ఈ ఎన్నికల్లో కేవలం పార్టీ గుర్తులు కాకుండా అభ్యర్థి వ్యక్తిగత పరిచయం, పట్టభద్రుల సమస్యలపై అవగాహన, అందుబాటులో ఉండే స్వభావం, ప్రచార నెట్‌వర్క్ కూడా ప్రాధాన్యత పొందవచ్చు.మొత్తంగా చూస్తే తెలంగాణలోని ఈ రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు జనసేన వంటి పార్టీలకు రాజకీయంగా ముఖ్యమైన పరీక్షగా మారుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పార్టీగా తన పాలనకు పట్టభద్రుల వర్గంలో ఉన్న స్పందనను అంచనా వేసుకునే పరిస్థితిలో ఉండగా, బీఆర్ఎస్ ప్రతిపక్షంగా తన సంస్థాగత బలాన్ని నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. బీజేపీ తన రాజకీయ విస్తరణను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నం చేస్తోంది. జనసేన మాత్రం తన రాజకీయ స్థానం, వ్యూహాన్ని ఈ ఎన్నికల ద్వారా స్పష్టం చేయాల్సిన పరిస్థితిలో ఉంది. అయితే తుది ఫలితాలను ముందుగానే నిర్ధారించడానికి వీలులేదు. అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల నమోదు, ప్రచార వ్యూహం, స్థానిక సమస్యలు, సామాజిక సమీకరణాలు, పోలింగ్ శాతం ఇవన్నీ కలిసి ఈ ఎన్నికల దిశను నిర్ణయించనున్నాయి. అందుకే ఈ రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు తెలంగాణ రాజకీయాల్లో రాబోయే పరిణామాలకు ఒక ముఖ్యమైన రాజకీయ సూచికగా నిలిచే అవకాశం ఉంది.

# ఎవర్నీ వదలరా..?

దేశంలో ఓటర్ల జాబితా సమగ్ర ప్రక్షాళనకు ఉద్దేశించిన సర్ ప్రక్రియ.. తీవ్ర గందరగోళానికి తెరతీస్తోంది. తొలి దశలో బీహార్, బెంగాల్ లాంటి రాష్ట్రాల్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. కాకపోతే అక్కడ రాజకీయ వేడి ఉండటంతో.. మిగతా రాష్ట్రాలు పెద్ద సీరియస్‌గా తీసుకోలేదు. కానీ అంత రాజకీయ వేడి లేని.. ఎన్నికలు ఇప్పట్లో లేని రాష్ట్రాల్లో.. మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లోనూ ఎన్నడూ లేని విధంగా సర్ ప్రక్రియ వివాదాస్పదం కావడం చర్చకు దారితీసింది. ఏకంగా లక్షల సంఖ్యలో ఓట్లు గల్లంతు కావడం చిన్న విషయం కానే కాదని రాజకీయ పార్టీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇంకా చిత్రం ఏమిటంటే మొదట్లో బీజేపీ వ్యతిరేక ఓట్లు తొలగిస్తున్నారనే విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత ఆ పార్టీ అనుకూల ఓట్లూ పోతున్నాయని కొందరు కాషాయ పార్టీ నేతలూ ఆందోళన వ్యక్తం చేసిన దాఖలాలు కనిపించాయి. దీంతో అసలు సర్‌కు దారీతెన్నూ లేదని తేలిపోయింది. అంతేకాదు సర్ ప్రక్రియ ఎవరి నియంత్రణలోనూ లేకపోగా.. కొత్త సమస్యలకు దారితీస్తుందని కూడా ఇప్పటికే తేలిపోయింది.మన దేశంలో మామూలుగా వీవీఐపీలకు స్పెషల్ ట్రీట్‌మెంట్ ఉంటుంది. కానీ సర్ లో మాత్రం వారికీ చిక్కులు తప్పటం లేదు. కోట్ల మంది సామాన్యులతో దారుణంగా ఆడుకున్న సర్.. ఇప్పుడు వీవీఐపీలకూ అదే గేమ్‌ను పరిచయం చేస్తోంది. దేశవ్యాప్తంగా ప్రముఖులైన వారి పేర్లలో చిన్న చిన్న తేడాలున్నాయని, మ్యాప్ కాలేదని, సర్ నోటీసులు వెళ్లాయి. దీంతో సర్ కష్టాలు ప్రముఖులకూ తెలిసొస్తాయని, ఇప్పటికైనా ఈసీకి విషయం తెలిసొస్తుందని సామాన్య ఓటర్లు భావిస్తున్నారు. సామాన్యులకు సర్ నోటీసుల విషయంలోనూ సరైన సమాధానం చెప్పలేకపోయిన ఈసీ.. ఇప్పుడు వీవీఐపీలకు నోటీసుల విషయంలోనూ అదే వైఖరి కనబరుస్తోంది. అదేమంటే నోటీసులు వచ్చినంత మాత్రాన ఓట్లు తొలగిస్తున్నట్టు కాదని సమర్థించుకుంటోంది. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో లక్షల మందికి సర్ నోటీసులు రావడం, మెజార్టీ ఓటర్లు విచారణకు విముఖత చూపిస్తున్న తరుణంలో.. రేపు వీవీఐపీల విచారణలో ఎన్ని సిత్రాలు జరుగుతాయో చూడాల్సి ఉంది.నోటీసులు అందుకున్న వారందరికీ ఆన్‌లైన్‌లో తప్పులు సరిచేసుకునే అవకాశాలిస్తున్నామని ఈసీ చెబుతోంది. వాదన వినిపించుకునే అవకాశం ఇచ్చి మాట్లాడాకగానీ ఎవరి పేరూ తొలగించబోమని కూడా ఎంతో పెద్ద మనసుతో చెబుతోంది. అంతేకాదు వీవీఐపీల పేర్లు ఏదోలా తుది జాబితాలో ఉంటాయనే విషయంలో ఎవ్వరికీ సందేహాలు అక్కర్లేదు. కానీ సామాన్యుడి గతేమిటి? సర్‌లో చోటు దొరక్కపోతే ఓటు కోల్పోవడం ఒక్కటే సమస్య కాదు. ఏదో ఒకరోజు మీరు ఈ దేశ పౌరులు కాదని అలాంటి వారందరూ వర్తమానం అందుకునే ప్రమాదం లేకపోలేదనే భయాలు వ్యక్తమతున్నాయి. పింఛన్ అందుకునే వారికి ప్రతియేటా ఒక తప్పనిసరి తంతు సాగుతుంటుంది. లైఫ్ సర్టిఫికెట్ పేరుతో ఎవరికి వారు తాము బతికేవున్నట్టు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తేనే తదుపరి నెల పింఛన్ అందుతుంది. అంటే ఏడాదిలో మిగతా 364 రోజులూ ఆ పేరుతో ఎవరు తీసుకున్నా పట్టించుకోరు. ఆ ఒక్కరోజూ మాత్రం నిరూపించు కోవాలి. సర్ ప్రక్రియ అందుకు భిన్నమేమీ కాదు. ఇంతకూ గతంలో ఉన్నత పదవుల్లో పనిచేసి నిష్క్రమించినవారికీ, ఆ పదవుల్లో కొనసాగుతున్నవారికీ ఈసీ నోటీసులిచ్చి అడగటం మాటేమోగానీ సర్ ప్రక్రియ ప్రహసనం గమనించి, ఇందుకా కోట్లాది రూపాయలు వ్యయం చేస్తున్నారన్న ప్రశ్న అయితే సాధారణ పౌరుల్లో తలెత్తుతుంది. ఢిల్లీ వరకూ చూసినా అక్కడ గత జాబితాలోని 33 శాతంమంది పేర్లు గల్లంతయ్యాయి. ఇప్పటికే మిగతా రాష్ట్రాల్లోనూ సర్ తుది జాబితాల విషయంలో లెక్కలేనన్ని అభ్యంతరాలొచ్చాయి. వస్తూనే ఉన్నాయి. ప్రతి రాష్ట్రంలో లక్షల మంది ఓట్లు గల్లంతవుతున్నా సరే .. ఈసీ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండటం.. ఆందోళనకు దారితీస్తోంది.మన దేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ప్రతి ఎన్నిక కేవలం రాజకీయ పార్టీల మధ్య పోటీకి ఒక వేదిక మాత్రమే కాదు, పౌరుల ప్రజాస్వామ్య విశ్వాసానికి నిదర్శనం కూడా. ఎన్నికల ప్రక్రియలో ఉండే నిష్పాక్షికత, పారదర్శకతే ఈ విశ్వాసానికి పునాది. ఏ పౌరుడు తన ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుంటాడో నిర్ధారించేది ఓటరు జాబితానే కాబట్టి, ఈ ప్రక్రియకు ఓటరు జాబితానే ఆధారం. ఈ తరుణంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్.. సర్ వివాదాలకి కేంద్రంగా మారటం ఎవరికీ మంచిది కాదు. ఓటర్ల జాబితా కచ్చితంగా, తాజాగా ఉండేలా చూసుకోవడానికి ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్రమం తప్పకుండా సవరిస్తుంది. కానీ ఆ ప్రక్రియలో ఎక్కడా అభ్యంతరాలు రాకుండా, పొరపాట్లు జరగకుండా చూసుకోవడం అత్యవసరం అనడంలో మరో మాటకు తావే లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 ప్రకారం, ఓటర్ల జాబితాల సమగ్రతను నిర్ధారించే అధికారం, ఆ బాధ్యత ఎన్నికల సంఘానికి అప్పగించారు. ఇక్కడ సర్ లక్ష్యాలు సానుకూలంగా ఉన్నప్పటికీ, దాని అమలుపై పలు ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మన దేశానికి ప్రజాస్వామ్యమే దాని అతిపెద్ద బలం, ఎన్నికల సంఘం దానికి కాపలాదారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వంటి కార్యక్రమాలను పారదర్శకతతో, విస్తృత భాగస్వామ్యంతో అమలు చేస్తే, అవి ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయగలవు. కానీ వాటిపై సందేహాలు మిగిలి ఉంటే, అది సంస్థాగత విశ్వాసాన్ని బలహీనపరుస్తుంది.ఇక్కడ పార్టీలు రాజకీయం చేస్తున్నాయా.. లేదా అనే విషయం గురించి పట్టించుకోకుండా.. ఈసీ తన వంతుగా రాజ్యాంగ నైతిక విలువలు, సాంకేతిక పారదర్శకత, పౌర భాగస్వామ్యం ఆధారంగా తన ప్రక్రియలను పునర్నిర్వచించుకోవడం.. ఆ సంస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతుంది. మరీ ముఖ్యంగా సర్ పై ఓటర్లు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం, వారి ఇబ్బందుల్ని పరిష్కరించడం చాలా ముఖ్యం. ఈసీకి ఓటర్లకు మధ్య సమాచార మార్పిడి సరిగ్గా ఉంటే.. సవాలక్ష సందేహాలకు తావుండనేది ప్రాథమిక సూత్రం. కానీ ఈసారి సర్ విషయంలో ఈసీ ఎక్కడలేని తొందరపాటు ఎందుకు ప్రదర్శిస్తుందనేది ఎవరికీ అంతుచిక్కని భేతాళ ప్రశ్న. ఓటర్లు ఎక్కడికీ పారిపోరు. ఓటర్ల జాబితాలు ఎలాగూ ఈసీ దగ్గరే ఉన్నాయి. అలాంటప్పుడు కొన్ని నెలల తరబడి సర్ జరిగితే మాత్రం ఏం కొంప మునుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. ఈసీ తీరు ఇలాగే ఉంటే.. అసలు ఓటర్ల జాబితా గురించి మర్చిపోవడం మంచిదని జనం అనుకునే ప్రమాదం.. తద్వారా ఓట్ల శాతం కనీస సాధ్యికి పడిపోయే ముప్పు పొంచి ఉన్నాయనేది కాదనలేని సత్యం.ఇప్పటికైనా ఈసీ సర్ అసలు ఉద్దేశాన్ని సరైన రీతిలో అర్థం చేసుకోవాలి. రాజ్యాంగ నిర్మాతలు ఈసీకి సర్ చేపట్టే అధికారం ఇచ్చిన మాట నిజం. కానీ ఆ అధికారాన్ని ఈ దేశ పౌరులందరికీ ఓటేసే హక్కు ఇవ్వడం కోసమే కానీ.. అవగాహన లేని బీఎల్వోలతో సర్ నిర్వహించి.. అసలుకు మోసం తేవటానికి కాదని పార్టీలు గుర్తుచేస్తున్నాయి. ఇకనైనా సర్ విషయంలో సరైన రీతిలో వ్యవహరించకపోతే.. ఈసీ సకాలంలో మేలుకోకపోతే.. భవిష్యత్తులో ఓట్లు భారీగా గల్లంతైతే.. ఓటర్లలో అనవసర ఆందోళన తలెత్తితే దానికి ఆ సంస్థే బాధ్యత తీసుకోవాలని బీఎల్వేలు హెచ్చరిస్తున్నారు. చేతులు కాలాక తమను సాయం అడిగినా.. మేం కూడా ఏమీ చేయలేయమని వారు ముందే చేతులెత్తేస్తున్నారు. ఏదేమైనా అర్హత గల ఓటర్లెవరో తేల్చాల్సిన సర్ ప్రక్రియ.. ఇలా అడుగడుగునా వివాదాలకు, లెక్కలేనన్ని సందేహాలకు ఆస్కారం ఇవ్వడం ఎవరికీ మంచిది కాదనే విషయంలో మరో మాటకు తావు లేదు. ఏతావాతా ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కును నిర్ధారించే కీలకమైన సర్ ప్రక్రియలో అసలు సీరియస్‌నెస్ కనిపించడం లేదనే వాదనలో నిజం లేకపోలేదు. ఇంత ప్రసహనంగా తయారైన సర్‌ను చూసి ఓటర్లే కాదు. మాజీ ఎన్నికల కమిషనర్లు, ప్రధాన ఎన్నికల కమిషనర్లు కూడా ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటిదాకా ఈసీ నిర్వహించిన సర్ లు.. ఓటర్లకు వెసులుబాట్లు ఇచ్చి మరీ ఓటర్ల జాబితాలో పేర్లు కొనసాగేలా ఉండేవి. కానీ ఈసారి సర్ మాత్రం ఓట్ల తొలగింపుకే కంకణం కట్టుకున్నట్టుగా కనిపిస్తోంది. అందుకే సర్ ప్రక్రియలో అడుగడుగునా ఈసీ నిర్వాకాలు బట్టబయలౌతున్నాయనే అభిప్రాయాలు వస్తున్నాయి.సర్ విషయంలో పై నుంచి కింది దాకా తలో మాట చెబుతున్నారు. ఈసీ ఇచ్చిన నిర్దేశాలకు, బీఎల్వోల వ్యవహారశైలికి మొదటే పొంతన కుదరలేదు. ఇది చాలదన్నట్టు బీఎల్వోల పర్యవేక్షణకు నియమితులైన సూపర్‌వైజర్లు, చివరకు జిల్లా ఎన్నికల అధికారులు కూడా సర్‌ను స్పీడందుకునేలా చేయడం మానేసి.. సకాలంలో ఫారాలు ఇవ్వకపోతే ఓట్లు పోతాయని ఓటర్లను బహిరంగంగా బెదిరించడం విడ్డూరంగా ఉంది. ఎంతసేపూ సర్‌ను షెడ్యూల్ ప్రకారం పూర్తిచేయాలనే తొందరే కానీ.. ఓటర్ల సాధకబాధకాలు పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పైగా ఓటర్లకు నోటీసులిచ్చినా స్పందించడం లేదని వారిపైనే నెపం నెట్టేస్తున్నారు. నిజానికి ఆ నోటీసులు కూడా ఓటర్లే బీఎల్వోల చుట్టూ తిరిగి తీసుకోవాల్సి వస్తుంది. తమ పనులు మానుకుని.. బీఎల్వోల చుట్టూ తిరిగితే ఎలాగనేది ఓటర్ల నుంచి వస్తున్న ప్రశ్న. వారింత మొత్తుకుంట్నున్నా.. బీఎల్వోల పద్ధతి మార్చాలనే ఆలోచన అధికారులకు రావడం లేదు. దీంతో విసిగిపోతున్న ఓటర్లు.. ఓట్లపైనా నిరాసక్తి పెంచుకుని.. విచారణకు దూరంగా ఉంటున్నారు. ఇక్కడే సర్ అసలు ఉద్దేశం దెబ్బతినడమే కాకుండా.. మొత్తంగా దేశంలో ఓటర్ల సంఖ్యలోనూ దారుణమైన తగ్గుదల నమోదైతే.. ఇక ఎన్నికలకు విశ్వసనీయత ఎలా ఉంటుందనే కొత్త ప్రశ్నలు మొగ్గ తొడుగుతున్నాయి.అసలు కొత్తగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదుచేయటానికి ఎన్నో పత్రాలు చూడాలి. స్వయంగా బీఎల్ఓ ఆ వ్యక్తి నివసించే ఇంటిని సందర్శించాలి. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదనేది నియమం. ఆ నియమాన్ని కచ్చితంగా పాటించే.. ఓటర్లుగా నమోదుచేశామని చెప్పే ఎలక్షన్ కమిషన్ తాను జారీచేసిన ఓటరు గుర్తింపు కార్డులనే సర్‌లో ప్రామాణికంగా తీసుకోలేమని సుప్రీంకోర్టుకు స్వయంగా చెప్పింది. అలాగే ఆధార్ కార్డు అందుకు ఉపయోగపడదని తేల్చి చెప్పింది. సుప్రీంకోర్టు చివరకు ఎలక్షన్ కమిషన్ వాదననే పరిగణనలోకి తీసుకుంది. ఆధార్ కార్డుని విదేశీవ్యక్తులకు కూడా జారీచేస్తారని, అందుకే అది ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో మన ఇంగితజ్ఞానం చెబుతూనే ఉంటుంది. ఎంతమంది విదేశీయులకు అధికారికంగా ఆధార్ కార్డులు జారీ అయివుంటాయో లెక్కలుతీస్తే వారి సంఖ్య చాలా పరిమితంగానే ఉంటుంది. వాళ్లు అయినా కొన్ని పత్రాలు సమర్పించకుండా కార్డులు పొందలేరు. అతి స్వల్పసంఖ్యలో విదేశీయులు ఆధార్ పొందుతుంటే మొత్తం ఆధార్ కార్డుల ప్రామాణికతనే శంకించటం సామాన్యుల తర్కానికి అందదు. పర్యాటకులుగానో, విద్యార్థులుగానో, ఉద్యోగులుగానో, పరిశోధకులుగానో వచ్చిన విదేశీ వ్యక్తులకు ఆధార్ ఇవ్వాలన్న నిబంధనను అధికారికంగానే పెట్టుకుని ఈ వాదనను చేయటం విడ్డూరంగానూ, వైపరీత్యంగానూ భావించాలి. ఇక ఇతర దేశాల సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందటం ఎక్కువగానే ఉందని అనుకుందాం. మరి అందుకు కారణం ఎవరు? అని ప్రశ్నించుకుంటే వేళ్లన్నీ అధికారయంత్రాంగం వైపే చూపుతాయి.సందేహాస్పద ఓటర్లందరినీ మనం అక్రమ వలసదారులుగా భావించలేం. బీఎల్ఓలకు సరైన పత్రాలను అందించలేని వాళ్లనూ ఆ జాబితాలో చేరస్తుతారు. ఇక్కడే సర్ ఉద్దేశం నీరుగారుతోంది. ఉదాహరణకు తెలంగాణలో 2002లో చేపట్టిన సర్ తర్వాత ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటువేసిన వారందరూ కూడా ఇప్పుడు మళ్లీ తమని తామే నిఖార్సైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఇంటర్‌నెట్‌ని ఉపయోగించగలిగినవాళ్లు కూడా 2002 నాటి సర్ జాబితాలో తమ పేర్లు వెతుక్కోటానికి కిందామీదా పడుతున్నారు. గంటలపాటు దానికోసం ప్రయత్నించి విఫలమై చివరకు 2002నాటి సర్‌లో తమపేరు లేదనే వెసులుబాటును ఉపయోగించుకుని ఎన్యూమరేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో పూర్తిచేస్తున్నారు. దీనికి ఫోన్‌నంబరు, ఆధార్ కార్డు వివరాలను సమర్పించి వాటి ఆధారంగా వచ్చే ఓటీపీలతో ప్రక్రియను పూర్తిచేస్తున్నారు. 2002 నాటి సర్ జాబితాతో సంబంధం లేకుండానే ఓటర్లుగా కొనసాగే అవకాశం ఉంటే.. అసలు దాంతో మొత్తం ప్రక్రియను ఎందుకు ముడిపెట్టాల్సి వచ్చిందనే ప్రశ్నకు ఈసీ ఇప్పటికైనా సమాధానం చెప్పగలదా అంటే సందేహమే.2002 నాటి సర్ ఎలా జరిగిందో చూస్తే.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పుడు సర్‌కు సంబంధించి ప్రత్యేక హడావుడి కనపడలేదు. మామూలు ఓటర్ల జాబితా సవరణ లాగే అది జరిగిపోయింది. బహుశా అప్పుడు ఎన్నికలు లేకపోవటం కూడా అందుకు కారణమై ఉంటుంది. దీనికి భిన్నంగా ఇటీవల బిహార్, బెంగాల్, తమిళనాడుల్లో తగిన సమయం ఓటర్లకు ఇవ్వకుండా హడావుడిగా సర్ చేపట్టటంతోనే తీవ్రస్థాయిలో వివాదాలు చెలరేగాయి. రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల వ్యూహాలు, ఎత్తుగడలు, ప్రచారాల్లో మునిగిపోయిన సందర్భంలో సర్ చేపట్టటం అనుచితంగానే కనపడుతుంది. ఆ అనుచిత చర్యలే ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను ప్రశ్నించేలా ఆస్కారం కల్పించాయి. అధికార వ్యవస్థలన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం కావాల్సిన రీతిలో ఒరిగిపోతున్న నేపథ్యంలో ఎన్నికల ముందు చేపట్టిన సర్‌పై అనుమానాలు కలగకుండా ఉండవు. ఇప్పుడే బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితి ఉంటే 2002లో సర్ అంతా సక్రమమని భావించి దాన్ని ప్రామాణికంగా తీసుకోవటం ఏ మాత్రం సహేతుకంగా అనిపించదు. అప్పటికి మొబైల్ ఫోన్లు లేవు. ల్యాండ్‌లైను ఫోను ఉన్న వాళ్లూ తక్కువే. సోషల్ మీడియా లేదు. ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఇప్పటి స్థాయిలో విస్తృత ప్రజానిఘా లేని ఆనాటి పరిస్థితిలో 2002 నాటి సర్‌కు చాలా పరిమితులు ఉంటాయి. పేర్లలో, ఇంటిపేర్లలో, వయస్సుల నమోదులో ఎన్నో తప్పులు ఆనాటి జాబితాలో కనపడతాయి. వీటన్నిటినీ సరిదిద్దుకోవాల్సిన బాధ్యతను ఇప్పుడు ఓటర్లపైనే పెట్టారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదుచేయటం రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ విధి. అలా నమోదుచేసిన వాళ్లను కొన్నేళ్ల తర్వాత .. మిమ్మల్ని మీరు ఓటర్లుగా నిరూపించుకోండి అని చివరికి అదే కమిషన్ ఆదేశించటం ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని పలుచన చేయటమేనని ఇప్పటికే ఎన్నో విమర్శలు వచ్చాయి. వస్తున్నాయి.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539 flashindia999@gmail.com

# ఏపీ, తెలంగాణలో ఫ్లాష్ ఫ్లడ్...!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏపీలో అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, పార్వతీపురం మన్యం జిల్లాలకు ఫ్లాష్ ఫ్లడ్ హెచ్చరికలు జారీ చేశారు. ఇక, తెలంగాణలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోనూ ఆకస్మిక వరదల ముప్పు ఉన్నట్లు అధికారులు అప్రమత్తం చేశారు.

**కళింగపట్నం సమీపంలో తీరం దాటిన తీవ్ర వాయుగుండం**

తీవ్ర వాయుగుండం రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 1 గంట మధ్య కళింగపట్నం సమీపంలో తీరం దాటినట్లు అధికారులు తెలిపారు. గడిచిన ఆరు గంటల్లో గంటకు సుమారు 3 కిలోమీటర్ల వేగంతో కదిలిన ఈ వ్యవస్థ మరో 12 గంటల పాటు తీవ్ర వాయుగుండంగా కొనసాగనుంది. ఆ తర్వాతి 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని వెల్లడించారు. తీరం దాటినప్పటికీ మరో 48 గంటల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. నేడు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. పోలవరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లోనూ కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**80 ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం**

గడిచిన 24 గంటల్లో పలు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదయ్యాయి. సుమారు 80 ప్రాంతాల్లో 100 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం రికార్డయింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆకస్మిక వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం హైఅలర్ట్‌లో ఉండాలని విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఆదేశించారు.

**ఎన్టీఆర్ జిల్లాలో కట్టలేరు వాగు ఉధృతి**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గంపలగూడెం మండలం వినగడప--తోటమూల మధ్య కట్టలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సుమారు 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చింతలపాడు ప్రాంతంలో బలమైన ఈదురుగాలులకు 74 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో గ్రామం నిన్నటి నుంచి విద్యుత్ సరఫరా లేక చీకటిలో ఉంది. మరోవైపు రెవెన్యూ శాఖ నిర్వహించిన ప్రాథమిక అంచనాల్లో 40 ఇళ్లు పాక్షికంగా, మరో 10 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు గుర్తించారు.

**విజయనగరంలో నీటమునిగిన పంట పొలాలు**

విజయనగరం జిల్లాలో గజపతినగరం, మెంటాడ, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లోని పత్తి పొలాల్లో భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. గజపతినగరం మండలం తమ్మిరాయుడుపేటలో వరి, పత్తి పంటలు నీటమునిగాయి. అటు, అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి ప్రాంతంలో భారీ వర్షాలకు ధారకొండ మండలంలోని గంగవరం రహదారి కొంతమేర కొట్టుకుపోయింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రహదారి పరిస్థితిని అధికారులు పరిశీలిస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారు.

**విశాఖలో 24 గంటల్లో 24 సెంటీమీటర్ల వర్షం**

అతి భారీ వర్షాలు విశాఖపట్నంపై తీవ్ర ప్రభావం చూపాయి. 24 గంటల వ్యవధిలో నగరంలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగా పలు రహదారులు దెబ్బతిన్నాయి. బీచ్ రోడ్ కొంతమేర కోతకు గురై, కొన్ని చోట్ల రహదారులు కుంగిపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. కామత్ జంక్షన్ వద్ద ఓ కారు నీటిలో కూరుకుపోయింది. తీవ్ర వాయుగుండం ప్రస్తుతం ఉత్తరాంధ్రపై కేంద్రీకృతమై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు. సాయంత్రానికి వ్యవస్థ ఉత్తర వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్రత తగ్గి వాయుగుండంగా మారే అవకాశం ఉన్నప్పటికీ, మరో 48 గంటలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# కూత వింటే చాలు.. పక్షి పేరేంటో వచ్చేస్తుంది!




**తాడ్వాయి,ఫ్లాష్ ఇండియా :** చిలక పలుకులు వినడం వేరు.. ఆ పక్షి ఏ జాతికి చెందిందో సాంకేతికతతో క్షణాల్లో కనిపెట్టడం వేరు.. కామారెడ్డి జిల్లా తాడ్వాయి గురుకుల పాఠశాల విద్యార్థినులు ఇప్పుడు ఇదే పనిలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ బడుల్లోని పిల్లలు సైతం కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సంకల్పం ఇక్కడ అద్భుతాలు సృష్టిస్తోంది. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య అధ్యయనం లక్ష్యంగా తాడ్వాయిలోని పీఎంశ్రీ.. టీజీఎస్‌డబ్ల్యూఆర్సీ.. జేసీ(జి)పాఠశాలలో ఎకో సెన్స్ బర్డ్ సౌండ్ డిటెక్షన్ ప్రాజెక్టును విజయవంతంగా అమలులోకి తెచ్చారు.

**కలెక్టర్ ఆలోచన.. అద్భుత ఆచరణ**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇందులో భాగంగానే పాఠశాల ప్రాంగణంలో పక్షుల కిలకిలారావాలను రికార్డ్ చేసి, రాస్ప్‌బెర్రీ-పై,కృత్రిమ మేధస్సు సహాయంతో వాటి జాతులను ఇట్టే పట్టేసే సరికొత్త వ్యవస్థకు రూపకల్పన చేశారు.గ్రామీణ ప్రాంత బాలికలు అంతర్జాతీయ స్థాయి పరిశోధనా ప్లాట్‌ఫామ్‌లతో అనుసంధానం కావడానికి ఈ ప్రాజెక్టు చక్కటి వేదికగా మారింది.

**పరిశోధన వైపు అడుగులు..**

తాడ్వాయి పరిసర ప్రాంతాల్లో ఏయే పక్షులు సంచరిస్తున్నాయి? ఏ కాలంలో వలస వస్తున్నాయి? అంతరించిపోతున్న అరుదైన జాతులు ఏమైనా ఉన్నాయా? వంటి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను ఈ టెక్నాలజీ సాయంతో విద్యార్థినులు స్వయంగా విశ్లేషిస్తున్నారు. కేవలం చదువు మాత్రమే కాకుండా, ప్రకృతిపై ప్రేమను పెంచుకుంటూ వారు సరికొత్త ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను సంపాదిస్తున్నారు. సమాజ శ్రేయస్సు, ప్రకృతి పరిరక్షణే ధ్యేయంగా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అందించిన ప్రోత్సాహం మా విద్యార్థినుల్లో అంతులేని ఉత్సాహాన్ని నింపిందని పాఠశాల ప్రిన్సిపాల్ బి.సురేఖ,ఎస్‌వీపీ ఎం. స్రవంతి, జేవీపీ ఎన్. అనూషలతో పాటు ఉపాధ్యాయ బృందం సంతోషం వ్యక్తం చేశారు.

# డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులో బిగ్ ట్విస్ట్







**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చిక్కుకున్న డీఎస్పీ భీమ్‌రెడ్డి కేసులో ఏసీబీ దూకుడు పెంచింది. భీమ్ రెడ్డికి సంబంధించి 8 మంది బినామీలను గుర్తించిన ఏసీబీ అధికారులు వారిపై ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలో పుప్పాల గూడలోని బీమ్ బెడ్డి బినామీ కోమటి వెంకటేశ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. పుప్పాలగూడతో సహా మొత్తం 8 చోట్ల ఏకకాలంలో రెయిడ్స్ నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ జి.శ్రీధర్ నేతృత్వంలో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి. బినామీల ఆస్తులు, డాక్యుమెంట్లు, ఆర్థిక లావాదేవీలపై అధికారులు ఆరా తీస్తున్నారు. సోదాల్లో లభించే పత్రాలు, ఆధారాలపై ఏసీబీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ సోదాల్లో ఓ బినామీ ఇంట్లో కట్టల నగదు బయటపడటం కలకలం రేపుతోంది. ఇండియన్ కరెన్సీతో పాటు విదేశీ కరెన్సీ కూడా పట్టుబడినట్లు తెలుస్తోంది.

**పొరుగు రాష్ట్రాల్లో భీమ్ రెడ్డి ఆస్తులు:**

కాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో భీమ్ రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. భీమ్ రెడ్డి రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా, కర్ణాటకలోనూ ఆయన భారీగా భూములు కొనుగోలు చేసినట్లు తేలింది. ముఖ్యంగా బెంగళూరు ఎయిర్‌పోర్టు సమీపంలోని విలువైన భూములతో పాటు జహీరాబాద్, వికారాబాద్ ప్రాంతాల్లో సుమారు 40 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పుడు బినామీలపై దృష్టి సారించడంతో ఈ కేసులో ఇంకా ఎలాంటి సంచలనాలు నమోదు కాబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది.

# యువతిపై సామూహిక అత్యాచారం..

## యూపీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది సహా నలుగురు అరెస్ట్

**ఉత్తరప్రదేశ్ :** రక్షణ కల్పించవలసిన ఖాకీలే కామాంధులు గా మారి దారుణానికి ఒడిగట్టిన ఉదంతం ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర కలకలం రేపింది. హర్యానాకు చెందిన 24 ఏళ్ల యువతిపై ఫామ్‌హౌస్‌లో సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఆరోపణలపై ఇద్దరు యూపీ పోలీసులతో పాటు ఇద్దరు కేంద్ర రిజర్వ్ పోలీస్ బలగాల (సీఆర్‌పీఎఫ్) సిబ్బందిని అధికారులు అరెస్ట్ చేశారు. అమ్రోహా జిల్లా పరిధిలోని హసన్‌పూర్ ప్రాంతంలో ఈ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. అమ్రోహా ఎస్పీ లఖన్ సింగ్ యాదవ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. హసన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఒక సబ్-ఇన్‌స్పెక్టర్, ఒక హెడ్ కానిస్టేబుల్‌తో పాటు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన మరో సబ్-ఇన్‌స్పెక్టర్, హెడ్ కానిస్టేబుల్ ఈ ఘోరానికి పాల్పడినట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు.హర్యానాలోని ఫతేహాబాద్‌కు చెందిన బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. సెప్టెంబర్ 20న ఆమెకు తెలిసిన ఒక మహిళా పరిచయస్తురాలు సంప్రదించి, అమ్రోహాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనం కోసం ముజఫర్‌నగర్ జిల్లా సౌరంగ్ గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మోహిత్‌ను కలవాల్సిందిగా సూచించింది. ఆమె మాటలు నమ్మి అక్కడికి వెళ్లిన బాధితురాలిని స్థానిక ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి ఈ నలుగురు సిబ్బంది సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లు ఆమె ఆరోపించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కేసు నమోదు చేసి, విచారణ చేపట్టి నలుగురు నిందితులను కటకటాల్లోకి నెట్టారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే ఈ తరహా అకృత్యానికి పాల్పడటంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

# ఈసీపై క్రిమినల్ విచారణ జరపాలి



**ఢిల్లీ :** దేశంలో ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాల అవకతవకలపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని వయనాడ్ కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేరళలోని కల్పట్టలో గురువారం మీడియాతో మాట్లాడిన ఆమె భారత ప్రజాస్వామ్య ప్రక్రియతో చెలగాటమాడే ఏ ఒక్కరైనా దేశ ద్రోహానికి పాల్పడినట్లేనని కుండబద్దలు కొట్టారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే అలాంటి వారికి ఎలాంటి చట్టపరమైన రక్షణ ఉండకూడదని ఆమె డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలను తారుమారు చేయడం, ఏకంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం అనేది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, దేశ సమగ్రతకు వ్యతిరేకంగా చేసిన క్షమించరాని నేరపూరిత చర్య అని ప్రియాంక గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు.ఎన్నికల కమిషనర్ చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడినప్పుడు ఆయనకు రాజ్యాంగ పరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఏమాత్రం లేదని ఆమె స్పష్టం చేశారు. తన కళ్లెదుటే ఇంతటి భారీ అక్రమాలు జరుగుతున్నాయని తెలిసినా, తోటి సహచర అధికారులు ఈ విషయాన్ని ఆయన దృష్టికి తెచ్చినప్పటికీ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తూ పక్షపాత ఎన్నికలు జరగడానికి అనుమతించారని ప్రియాంక గాంధీ ఆరోపించారు. సాధారణ నేరస్థుడిని ఎలాగైతే విచారిస్తారో.. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన ఎన్నికల కమిషనర్‌పై కూడా అదే తరహాలో క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టి కఠినంగా శిక్షించాలని ఆమె గట్టిగా డిమాండ్ చేశారు. ఎన్నికల పారదర్శకతపై విపక్షాలు లేవనెత్తుతున్న ప్రశ్నల నేపథ్యంలో ప్రియాంక చేసిన ఈ వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.





# కేపీహెచ్‌బీ-వేవ్‌రాక్ మార్గంలో ప్రత్యేక బస్ లేన్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఐటీ ఉద్యోగుల రాకపోకలతో పీక్ అవర్స్‌లో కేపీహెచ్‌బీ-వేవ్‌రాక్ మార్గంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మార్గంలో టీజీఎస్‌ఆర్టీసీ, ఐటీ కంపెనీల బస్సులకు ప్రత్యేక లేన్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తూ బుధవారం సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. రహదారి సామర్థ్యం, ట్రాఫిక్ ప్రవాహం, ప్రత్యేక బస్ లేన్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.

**జేఎన్‌టీయూ-బయో డైవర్సిటీపై ప్రత్యేక దృష్టి**

ట్రయల్ రన్‌లో కేపీహెచ్‌బీ-వేవ్‌రాక్ మార్గంతో పాటు జేఎన్‌టీయూ-బయోడైవర్సిటీ కారిడార్‌లో పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ రాకపోకలను పరిశీలించారు. ప్రత్యేక బస్ లేన్ ఏర్పాటు వల్ల సాధారణ వాహనాల రాకపోకలపై ఎలాంటి ప్రభావం ఉంటుంది? ఏ ప్రాంతాల్లో లేన్ కేటాయింపు సాధ్యమవుతుంది? ఎక్కడ మలుపులు, జంక్షన్లు, విలీన మార్గాలు సమస్యగా మారే అవకాశం ఉంది? వంటి అంశాలను కూడా పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.పరిశీలనలను విశ్లేషించిన అనంతరం ప్రత్యేక బస్‌లేన్ ఏర్పాటుపై తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు. ట్రయల్ రన్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ ట్రాఫిక్ శేషాద్రిని రెడ్డి, టీజీఎస్ ఆర్టీసీ ఈడీ శ్రీధర్, ఎస్సీఎస్సీ సీఈఓ నవీద్ ఆలమ్ ఖాన్‌తో పాటు రోడ్డు, నగర ప్రణాళిక నిపుణులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సామాన్యులకు భారీ ఊరట..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దేశీయ మార్కెట్‌లో వంటనూనెల ధరలకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వివిధ రకాల వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని భారీగా తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై భారీగా..**

ఇక క్రూడ్ సోయాబీన్ నూనె, క్రూడ్ పామ్ ఆయిల్‌పై ఇప్పటి వరకు అమల్లో ఉన్న 10 శాతం ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని 5 శాతానికి తగ్గించారు. అలాగే, రిఫైండ్ సోయాబీన్ నూనె, రిఫైండ్ పామ్ ఆయిల్‌పై పన్నును 32.5 శాతం నుంచి 27.5 శాతానికి కుదించారు. ఈ తగ్గింపుతో దిగుమతి వ్యయం తగ్గనుంది. అదేవిధంగా దేశంలో మెజారిటీ ప్రజలు వాడే సన్‌ఫ్లవర్ నూనె దిగుమతులపై కేంద్రం మరింత ఉపశమనం కల్పించింది. క్రూడ్ సన్‌ఫ్లవర్ నూనెపై ఉన్న 10 శాతం కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా చేసింది. అదేవిధంగా రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై పన్నును 32.5 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గించింది. ఈ సవరించిన కస్టమ్స్ డ్యూటీ రేట్లు రేపటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది.

# ఆయుధాల చోరీ కేసులో బిగ్ ట్విస్ట్...!





**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోని బొల్లారం మద్రాసు రెజిమెంట్ నుంచి ఆయుధాలను చోరీ చేసిన కేసులో మరో బిగ్ ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో అరెస్టైన మాజీ హవాల్దార్ మల్లేష్‌కు గతంలో నేర చరిత్ర ఉందని మల్కాజ్ గిరి పోలీసు కమిషనరేట్ పోలీసులు కస్టడీ విచారణలో నిర్ధారించుకున్నారు. మల్లేష్ పై 2005 నుంచి 2007 వరకు అచ్చంపేట, అమ్రాబాద్ పోలీస్ స్టేషన్‌లలో హౌజ్ బ్రేకింగ్ (ఇళ్లలో చోరీలు) కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆ రెండు కేసులు కోర్టులో వీగిపోయి మల్లేష్ నిర్దోషిగా బయటపడినట్లు పోలీసులు గుర్తించారు.మిలటరీ ఉద్యోగంలో ఎంపికైన సమయంలో మల్లేష్ ఈ విషయాలను మిలటరీ అధికారులకు చెప్పాడా..? ఉద్యోగంలో ఎంపిక చేసిన మిలటరీ ఉన్నతాధికారులు మల్లేష్ బ్యాక్ గ్రౌండ్ ను సరైన పద్ధతిలో తనిఖీ చేశారా.? అనే విషయాలపై పోలీసులు ఇప్పుడు దృష్టి పెట్టారు. ఎంపిక సమయంలో మల్లేష్ మిలటరీ అధికారులకు సమర్పించిన ప్రతాలు పోలీసులు మరోసారి పరిశీలించేందుకు సిద్ధమవుతున్నారు.మరోవైపు మల్లేష్ మద్రాసు రెజిమెంట్ యూనిట్ నుంచి ఆయుధాలను చోరీ చేసేందుకు ఎన్ని నెలల నుంచి ప్లాన్ చేశాడు.? ఎలా స్కెచ్ వేసుకున్నాడు? దీని కోసం ఇంకా ఎవరినైనా సంప్రదించాడా? ఇంటర్నెట్ ద్వారా ఏదైనా సమాచారం సేకరించాడా.? అనే విషయాలపై పోలీసులు దృష్టి పెట్టారు. మల్లేష్ మిలటరీ ఆయుధాల చోరీకి ఆదివారాన్ని ఎందుకు ఎంచుకున్నాడనే.. అంశం పై పోలీసులు ప్రత్యేకంగా నజర్ పెట్టారు.ఈ విషయం పై మల్లేష్ ను ప్రశ్నించగా.. ఆదివారం రోజైతే మల్లేష్ టార్గెట్ చేసుకున్న స్పాట్‌లో ఉన్నతాధికారుల నిఘా తక్కువగా ఉండడం వారి రాకపోకలు అసలు జరుగవని అవగాహన ఉంది. అంతేకాకుండా గార్డ్ డ్యూటీలో ఉండే వారు కూడా కొంత రెస్ట్ మోడ్‌లో ఉంటారని మల్లేష్ కు స్పష్టంగా తెలుసు. అందుకే అతను ఆదివారాన్ని తన చోరీకి అనువైన రోజుగా ఎంచుకున్నట్లుగా పోలీసులకు తెలిపినట్లు సమాచారం.కస్టడీలో ఉన్న మల్లేష్ ను బొల్లారం పోలీసు అధికారులతో కలిసి మిలటరీ ఇంటెలిజెన్స్ అధికారులు సైతం విచారించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వినాయక నిమజ్జనం అనంతరం పోలీసు ఉన్నతాధికారులతో కలిసి మిలటరీ ఇంటెలిజెన్స్ అధికారులు మల్లేష్‌ను ప్రశ్నించనున్నట్లు సమాచారం. ఇంకా మల్లేష్ తన మొబైల్ ఫోన్ లో డిలీట్, క్లియర్ చాట్ చేసిన విషయాలపై ఫోరెన్సిక్ ల్యాబ్ అధికారుల నివేదిక వచ్చిన తర్వాత వాటి పై కూడా పోలీసులు ప్రశ్నించనున్నారని సమాచారం. కస్టడీలోని విచారణ అంశాలు పోలీసులు అధికారికంగా ధ్రువీకరించడం లేదు.

# ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించాలి





**పెద్దపల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డుల నిర్వహణ, సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. స్టేషన్ పరిధిలో నేరాల పరిస్థితి, శాంతిభద్రతలు, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితులకు సత్వరమే మెరుగైన సేవలు అందించాలని సీపీ సూచించారు. 5ఎస్ విధానాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తూ స్టేషన్‌ను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్‌లో ఉన్న వ్యక్తులు, ఇతర నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.అనంతరం సుల్తానాబాద్‌లోని సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన సీపీ, మరిన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ తనిఖీలో సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్ఐ చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షానికి కూలిన ఇల్లు..

**మోతె, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లు కూలిన ఘటన మోతె మండలం కూడలి గ్రామం లో జరిగింది గ్రామానికి చెందిన కొప్పు సతీష్ కూలి పని చేసుకుంటూ జీవనం గడుపుతున్నడు రాత్రి కురిసిన వర్షం ఇల్లు కూలిపోయింది అని ఇంట్లో సామాన్లు అన్ని తడిసి పాడైపోయాయని ఆవేదన వ్యక్తం చేసాడు తనకి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తన నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులని, అధికారుల ని వేడుకున్నాడు

# ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఆవిర్భవ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయండి



**వలిగొండ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఈనెల 27న యాదగిరిగుట్టలో జరిగే ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి, గౌరవాధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి లు పిలుపునిచ్చారు. గురువారం ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారగోని శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల ఆకాంక్షలకై గత తొమ్మిది సంవత్సరాలుగా డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి ఉద్యమకారుల హక్కులను మేనిఫెస్టోలో పెట్టించిన ఘనత ఉద్యమకారుల పోరందేనని, ఈనెల 27న యాదగిరిగుట్టలో లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రాంగణంలో జరిగే తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుండి ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారుడు బొడిగె సుదర్శన్ గౌడ్, చిలుగూరి సత్తిరెడ్డి, కదిరేణి స్వామి, ఐటిపాముల పుష్పమ్మ, కన్నెకంటి శ్రీనివాసచారి, కొండూరు శ్రీరాములు, సత్తయ్య, పల్లెర్ల రామచంద్రం, దండ మల్లికార్జున్, ఉక్కుర్తి యాదయ్య, పారుపల్లి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# పాములూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**పామూరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పామూరు మండలంలోని రావిగుంటపల్లి, వగ్గంపల్లి గ్రామాలలో బుధవారం ఏవో అబ్రహం లింకన్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. అప్పుడు మాత్రమే ఇన్సూరెన్స్, నష్ట పరిహారం మొదలైనవి వస్తాయని అన్నారు. ప్రతి రైతుకు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ ఉండాలని అన్నారు.

# మార్కాపురం జిల్లా నూతన ఎస్పీ



**మార్కాపురం జిల్లా,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన ఎస్పీగా పంకజ్ కుమార్ మీనా గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు చేపట్టారు. నూతన ఎస్పీకి జిల్లా పోలీసుల గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ పంకజ్ కుమార్ మీనా వెల్లడించారు.

# విద్యుత్ సరఫరా,సాగునీటి విడుదలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం





**మిర్యాలగూడ ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** రైతులకు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ, రెండు పంటలకు సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మాజీ మంత్రి,సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచనతో,మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో గురువారం దామరచర్ల మండలంలోని వీర్లపాలెం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాకు మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో రైతులు,బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. రాష్ట్రంలో విద్యుత్,సాగునీటి సమస్యలపై బీఆర్ఎస్ ఇప్పటికే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.భారీగా పోలీసు బలగాలను మోహరించి బారికేడ్లు ఏర్పాటు చేసి బీఆర్ఎస్ శ్రేణులను ఎక్కడికక్కడ నిలువరించారు.మొదట మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి ప్లాంటు లోపలి వెళ్లి సి.ఈ ని కలిసి ఎంత ఉత్పత్తి అవుతుంది తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అవసరమైన సమ-యంలో విద్యుత్ సరఫరా చేయడంతో పాటు,సాగుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ రైతులకు సరిపడా విద్యుత్ అందడం లేదని ఆరోపించారు. ఆనాడు మా హయంలో అందరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పమని కాని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలను ఆంధ్రా వ్యక్తులకు అమ్ముకుంటున్నారని తెలిపారు.ఈ సందర్భంగా నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఇక్కడ 4 వేల మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటు చేస్తే చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం బొగ్గు సరఫరా చేయకుండా అమ్ముకొని విద్యుత్ ఉత్పాదనలో ఆటంకం కల్పిస్తున్నారని వాపోయారు. రైతులకు సాగు సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, రెండు పంటలకు అవసరమైన సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదని అన్నారు.రైతుల పంటలు ఎండిపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించాలని, సాగునీటి విడుదలపై స్పష్టమైన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి,జిల్లా అధ్యక్షులు రామావత్ రవీంద్ర కుమార్ నాయక్,మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్,మాజీ ఎమ్మెల్యే లు కంచర్ల భూపాల్ రెడ్డి,నోముల భగత్, ఫైళ్ళ శేఖర్ రెడ్డి,గాదరి కిషోర్,ప్రభాకర్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,తిప్పన విజయసింహా రెడ్డి, రాష్ట్ర నాయకులు పిల్లుట్ల రఘు,నరసింహా రెడ్డి,ఇస్లావాత్ రామచందర్ నాయక్,పల్లె రవి, చింతల వెంకటేశ్వరా రెడ్డి,చింతరెడ్డి శ్రీనివాస రెడ్డి,దుర్గంపూడి నారాయణ రెడ్డి,పలువురు బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు,రైతులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రణయ్ హత్య కేసులో ఏ4 నిందితుడు అబ్దుల్ బారీ మృతి



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సంచలనం సృష్టించిన నల్గొండ ప్రణయ్ హత్య కేసులో ఏ4 నిందితుడిగా జీవిత ఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ మృతి చెందాడు. ప్రస్తుతం చర్లపల్లి జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు గుండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన జైలు సిబ్బంది హుటాహుటిన అతడిని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బారీ కన్నుమూశాడు. కాగా, నల్లగొండలోని ప్యారసభాగ్ కాలనీకి చెందిన అబ్దుల్ బారీ గతంలో గుజరాత్ మాజీ మంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ శిక్ష అనుభవించాడు. 2018 సెప్టెంబర్ 14న నల్గొండలో జరిగిన ప్రణయ్ హత్య కేసులో ఇతడు ఏ4 నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం అబ్దుల్ బారీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మరింత పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

**గతేడాది కోర్టు కీలక తీర్పు:**

ఈ కేసులో గతేడాది మార్చిలో నల్గొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కేసులో ఏ2గా ఉన్న సుభాష్‌కుమార్ శర్మకు ఉరిశిక్ష విధించగా, మిగిలిన నిందితులకు జీవితఖైదు ఖరారు చేసింది. ఏ1గా ఉన్న మారుతీరావు 2020లోనే ఆత్మహత్యకు పాల్పడగా.. ఏ2 సుభాష్‌కుమార్‌శర్మ, ఏ3 అస్గర్‌అలీ, ఏ4 అబ్దుల్ బారీ, ఏ5 కరీం, ఏ6 శ్రవణ్‌కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాంలను కోర్టు దోషులుగా తేల్చిన సంగతి తెలిసిందే.

# ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో ఊరట




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కొత్త సినిమాలను అక్రమంగా హెచ్‌డీ ప్రింట్లతో ఆన్‌లైన్‌లో పెడుతూ తెలుగు సినీ పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టం చేకూరుస్తున్న ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ కేసులో ప్రధాన నిందితుడు రవికి నాంపల్లి కోర్టులో భారీ ఊరట లభించింది. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఫ్రీజ్ చేసిన ఆయన వ్యక్తిగత బ్యాంకు ఖాతాలను తక్షణమే డీఫ్రీజ్ చేయాలని న్యాయస్థానం దర్యాప్తు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. తన కుటుంబ ఆర్థిక ఇబ్బందులను వివరిస్తూ నిందితుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయ-స్థానం ఈ మేరకు కీలక తీర్పును వెలువరించింది.

**ఈ కేసుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..**

ఐబొమ్మ వెబ్‌సైట్ ద్వారా సినిమాలను పైరసీ చేస్తున్న వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రవిని పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. ఆ సమయంలో ఆయన ఆర్థిక లావాదేవీల మూలాలపై దర్యాప్తు చేపట్టిన సైబర్ క్రైమ్ పోలీసులు.. పైరసీ ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ అయి ఉండొచ్చన్న అనుమానంతో రవికి చెందిన అన్ని బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేయించారు. అయితే.. తన బ్యాంకు ఖాతాలు స్తంభించిపోవడంతో తన కుటుంబం తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని పేర్కొంటూ రవి నాంపల్లి న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఖాతాలు ఫ్రీజ్ కావడంతో తన కుటుంబ పోషణకు, రోజువారీ కనీస అవసరాలకు కూడా డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దయచేసి బ్యాంకు ఖాతాలపై ఉన్న ఫ్రీజ్‌ను ఎత్తివేయాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు కనీసం బ్యాంకు ఖాతాలను వాడుకునేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు.పిటిషనర్ వాదనలను, కుటుంబ వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న నాంపల్లి కోర్టు.. రవి అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించింది. దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, కుటుంబ పోషణ కోసం తన బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేలా ఆయనకు స్వేచ్ఛను కల్పించింది. రవి బ్యాంకు ఖాతాలపై విధించిన ఫ్రీజ్‌ను తక్షణమే ఎత్తివేయాలని సంబంధిత పోలీసు అధికారులను న్యాయ-స్థానం ఆదేశించింది.

# పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి



**ఉప్పునుంతల,ఫ్లాష్ ఇండియా :** ఉప్పునుంతల మండలం రాయిచేడ్ గ్రామంలో అచ్చంపేట నియోజకవర్గానికి సంబంధించిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి, పాఠశాల నిర్మాణానికి చేపట్టాల్సిన పనులు, ప్రస్తుత పనుల పురోగతి, నిర్మాణానికి సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ సామగ్రి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలతో పాటు సురక్షితమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా పాఠశాల నిర్మాణాన్ని చేపట్టాలని ఆయన సూచించారు. తరగతి గదులు, విద్యార్థుల వసతి, భోజన సదుపాయాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, క్రీడా సౌకర్యాలు తదితర అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మె-రుగైన వసతి సౌకర్యాలు అందించేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కీలకంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఆయన వెంట ఉప్పునుంతల తహసీల్దార్ అద్దంకి సునీత, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరదనీరు..

**చర్ల,ఫ్లాష్ ఇండియా :** మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో చర్ల మండలంలోని తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టుకు వరదనీరు భారీగా వచ్చి చేర-ుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రాజెక్టులోకి వరద ప్రవాహం పెరగడంతో 8 గేట్లను 2 అడుగుల మేర ఎత్తి 10,849 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రా-జెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 74 మీటర్లు కాగా, ప్రస్తుతం 73.34 మీటర్లుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వరద ఉధృతి, ప్రా-



జెక్టు నీటిమట్టాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రాజెక్టు డీఈ తిరుపతిరావు సిబ్బందితో కలిసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వరద ప్రవాహం మరింత పెరిగితే నీటి విడుదలను పెంచే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# 24 ఏళ్ల తర్వాత మరో ప్రపంచకప్..




కొన్ని మ్యాచ్‌లు చరిత్రలో నిలిచిపోతాయి.. మరిచిపోలేని మధురానుభూతిని అందిస్తాయి.. అందులో ఒకటి.. చరిత్ర సృష్టించిన మ్యాచ్.. సెప్టెంబర్ 24, 2007.. భారత క్రికెట్ అభిమానులు ఎప్పటికీ మర్చిపోలేని రోజు. దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్ వాండరర్స్ స్టేడియంలో జరిగిన తొలి ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్, పాకిస్థాన్‌ను 5 పరుగుల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలోని యువ భారత జట్టు తొలి టీ20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.

**గంభీర్ అద్భుత ఇన్నింగ్స్**

టాస్ గెలిచిన భారత్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఆరంభంలో వికెట్లు కోల్పోయినప్పటికీ గౌతమ్ గంభీర్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. 54 బంతుల్లో 75 పరుగులతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. రోహిత్ శర్మ 30 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో భారత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసి, పాకిస్థాన్ ముందు 158 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. పాకిస్థాన్ బౌలర్ ఉమర్ గుల్ మూడు వికెట్లు పడగొట్టాడు.

**పాకిస్థాన్ పోరాటం**

158 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. మహమ్మద్ హాఫీజ్ ఒక పరుగుకే ఔటయ్యాడు. అయితే ఇమ్రాన్ నజీర్ కేవలం 14 బంతుల్లో 33 పరుగులు చేసి జట్టుకు వేగం అందించాడు. అనంతరం వరుస వికెట్లతో పాకిస్థాన్ ఒత్తిడిలో పడింది. ఒక దశలో 6 వికెట్లకు 77 పరుగులకే పరిమితమైంది. అయితే మిస్బా-ఉల్-హక్ అద్భుత పోరాటం చేశాడు. హర్భజన్ సింగ్ బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో మూడు సిక్సర్లు బాది మ్యాచ్‌ను మళ్లీ పాకిస్థాన్ వైపు మళ్లించాడు. చివరి వరకు క్రీజులో నిలిచి జట్టును విజయానికి చేరువ చేశాడు.

**చివరి ఓవర్‌లో ఉత్కంఠ**

పాకిస్థాన్ విజయానికి చివరి ఓవర్‌లో 13 పరుగులు అవసరమయ్యాయి. కెప్టెన్ ధోనీ బంతిని జోగిందర్ శర్మకు అందించాడు. తొలి బంతి వైడ్ కాగా, రెండో బంతికి మిస్బా పరుగులు చేయలేదు. ఆ తర్వాతి బంతిని ఫుల్‌టాస్‌గా అందుకున్న మిస్బా సిక్సర్‌గా మలిచాడు. ఇక పాకిస్థాన్ విజయానికి నాలుగు బంతుల్లో ఆరు పరుగులు మాత్రమే అవసరమయ్యాయి. ఈ సమయంలో మిస్బా స్కూప్ షాట్ ఆడేందుకు ప్రయత్నించాడు. బంతి గాల్లోకి లేవగా శ్రీశాంత్ ముందుకు వచ్చి అద్భుతంగా క్యాచ్ పట్టాడు. అంతే.. భారత శిబిరంలో సంబరాలు మొదలయ్యాయి.

**భారత్‌కు తొలి టీ20 ప్రపంచకప్**

మిస్బా 43 పరుగులతో పాకిస్థాన్ తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరికి పాకిస్థాన్ 152 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. భారత బౌలర్లలో ఆర్పీ సింగ్, ఇర్ఫాన్ పఠాన్ చెరో మూడు వికెట్లు తీయగా, జోగిందర్ శర్మ రెండు వికెట్లు పడగొట్టాడు. ఫైనల్‌లో కీలక ప్రదర్శన చేసిన ఇర్ఫాన్ పఠాన్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. షాహిద్ అఫ్రిది ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికయ్యాడు. 1983లో కపిల్ దేవ్ నాయకత్వంలో వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత్.. 24 ఏళ్ల తర్వాత ధోనీ సారథ్యంలో మరో ప్రపంచకప్‌ను అందుకుంది. చివరి ఓవర్, మిస్బా షాట్, శ్రీశాంత్ క్యాచ్ మాత్రం ఈ మ్యాచ్‌ను భారత క్రికెట్ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోయేలా చేసింది.. సెప్టెంబర్ 24వ తేదీ సందర్భంగా ఆ అపూర్వ విజయాన్ని మరోసారి గుర్తుచేసుకుందాం..




# వరుసగా మూడో పతకం..

భారత వుషు క్రీడాకారిణి రోషిబినా దేవి ఆసియా క్రీడల్లో మరోసారి సత్తా చాటింది. చివరి నిమిషంలో జట్టులో చోటు దక్కించుకున్న రోషిబినా దేవి రజతంతో మెరిసింది. జపాన్‌లోని ఐచి-నాగోయా వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో మహిళల 60 కిలోల సాండా విభాగంలో ఆమె రజతం పతకం సాధించింది. ఫైనల్లో చైనాకు చెందిన జాంగ్ షియా-వోయు చేతిలో 0-2 తేడాతో ఓడిపోయింది. రెండు రౌండ్లలోనూ చైనా క్రీడాకారిణి ఆధిపత్యం ప్రదర్శించింది. రోషిబినా దేవికి ఆసియా క్రీడల్లో ఇది వరుసగా మూడో పతకం. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో ఆమె కాంస్య పతకం సాధించింది. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో 60 కిలోల సాండా విభాగంలో రజతం గెలిచింది. ఇప్పుడు 2026 ఐచి-నాగోయా క్రీడల్లోనూ రజతం దక్కించుకుంది. దీంతో వరుసగా మూడు ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన తొలి భారత వుషు క్రీడాకారిణిగా రోషిబినా నిలిచింది. అయితే ఈసారి ఆసియా క్రీడల ప్రయాణం రోషిబినాకు అంత సులభంగా సాగలేదు. మహిళల 60 కిలోల విభాగానికి జరిగిన ట్రయల్స్‌లో రోషిబినాను దివ్యాంశి చౌదరి ఓడించి భారత జట్టులో స్థానం సంపాదించింది. ఆ తర్వాత దివ్యాంశికి గాయం కావడంతో ఆమె స్థానంలో రోషిబినాను జట్టులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో దివ్యాంశికి తీవ్ర స్థాయి ఏసీఎల్ గాయం ఉన్నట్లు తేలడంతో ఆమెను జట్టు నుంచి తప్పించి రోషిబినాను ఎంపిక చేశారు. ఇలా చివరి నిమిషంలో జట్టులోకి వచ్చిన రోషిబినా ప్రీ-క్వార్టర్ ఫైనల్లో బంగ్లాదేశ్‌కు చెందిన షికా ఖాతూన్‌ను, క్వార్టర్ ఫైనల్లో మకావుకు చెందిన చు మాన్ సిన్‌ను, సెమీఫైనల్లో ఇండోనేషియాకు చెందిన థానియాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్లో ఓటమి పాలై రజతంతో సరిపెట్టుకుంది.

# వైభవ్ సూర్యవంశీ ఆడతాడని అనుకున్నా




జపాన్‌తో జరిగిన చారిత్రాత్మక తొలి పురుషుల టీ20 మ్యాచ్‌లో భారత్ తరఫున ఆడుతున్న 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి ప్లేయింగ్ ఎలెవెన్‌లో చోటు దక్కలేదు. ఈ మ్యాచ్‌లో భారత్ కేవలం 2 పరుగుల తేడాతో అతికష్టం మీద విజయం సాధించింది. అయితే, వైభవ్ బరిలోకి దిగుతాడని ఆశించిన జపాన్ కెప్టెన్ కెండెల్ కడోవాకీ-ఫ్లెమింగ్ నిరాశ వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ స్థాయిలో అద్భుతమైన గుర్తింపు తెచ్చుకున్న ఆ యువ సంచలనాన్ని మైదానంలో ఆడటాన్ని తాను చూడాలనుకున్నానని, కానీ టీమ్ షీట్‌లో అతని పేరు లేకపోవడం తనకు నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. భారత్, జపాన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలకి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన ఈ మ్యాచ్‌లో వైభవ్ భారత స్క్వాడ్‌లో ఉన్నప్పటికీ తుది జట్టులో అవకాశం లభించలేదు. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించడంతో ఇన్నింగ్స్ కేవలం ముప్పై బంతులకే పరిమితమైంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఐదు ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి కేవలం 32 పరుగులు మాత్రమే చేసింది. జపాన్ స్పిన్నర్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ తొలి బంతికే వెనుదిరగగా, సంజు శాంసన్ కూడా నిరాశపరిచారు. చిన్న లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ జట్టు భారత్‌కు చుక్కలు చూపించింది. జపాన్ కెప్టెన్ 12 పరుగులు చేసి జట్టును గెలుపు ముఖం వైపు నడిపించినప్పటికీ.. చివరి ఓవర్‌లో అక్షర్ పటేల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి కేవలం రెండు పరుగులే ఇచ్చారు. చివరి బంతికి నాలుగు పరుగులు కావాల్సిన దశలో జపాన్ ఒక్క పరుగు మాత్రమే తీయగలిగింది. దీంతో భారత్ 2 పరుగుల తేడాతో అతికష్టంగా విజయం సాధించింది. ఏషియన్ గేమ్స్ 2026కు ముందు జరిగిన ఈ సన్నాహక మ్యాచ్‌లో టీమిండియా ప్రదర్శన తీవ్ర చర్చనీయాంశమైంది. వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం ఇవ్వకపోవడంపై సర్వత్రా చర్చ సాగుతోంది.

# బీసీసీఐ అధికారిక ప్రకటన

ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2027 సీజన్‌కు సంబంధించిన వేలంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి తొలి అధికారిక ప్రకటన విడుదల చేసింది. గత మూడేళ్లుగా విదేశాల్లో జరుగుతూ వచ్చిన ఐపీఎల్ వేలం, ఈసారి మళ్లీ భారత్‌లోనే నిర్వహించనున్నారు. ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ , బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా వెల్లడించిన వివరాల ప్రకారం.. ఐపీఎల్ 2027 మినీ వేలం ఈ ఏడాది డిసెంబర్ డిసెంబర్ 15-16 తేదీల్లో గోవా వేదికగా జరగనుంది. కాగా, గత మూడు సీజన్లలో ఐపీఎల్ వేలాలు దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో జరిగాయి. అయితే, ఈసారి వేలాన్ని మళ్లీ స్వదేశానికి తీసుకురావాలనే ఉద్దేశంతో గోవాను వేదికగా ఖరారు చేసినట్లుగా అధికారులు తెలిపారు.

# బిజినెస్

# అంబానీని దాటేసిన అదానీ..



భారత దేశంలో అత్యంత సంపన్నుడు ఎవరనే ప్రశ్నకు ఎలాంటి అనుమానం లేకుండా అందరూ అంబానీ పేరునే చెబుతారు. కానీ మీరు కూడా అలా చెబితే పప్పులో కాలు వేసినట్లే.. ఎందుకంటే తాజాగా నిర్వహించిన సర్వేలో దేశంలో అత్యంత సంపన్నుడు ఎవరనే ప్రశ్నకు సరికొత్త సమాధానాలు వచ్చాయి. రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని వెనక్కి నెట్టి, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మళ్లీ అగ్రపీఠాన్ని కైవసం చేసుకున్నారు. 'ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026' రిలీజ్ చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అదానీ కుటుంబం మొదటి స్థానాన్ని తిరిగి దక్కించుకుని సంచలనం సృష్టించింది. తాజా నివేదిక ప్రకారం.. గౌతమ్ అదానీ సంపద ఏడాది వ్యవధిలోనే 13 శాతం మేర పెరిగి రూ. 9.23 లక్షల కోట్లకు (96 బిలియన్ డాలర్లు) చేరుకుంది. మరోవైపు ముఖేష్ అంబానీ నికర విలువ 10 శాతం తగ్గి రూ. 8.63 లక్షల కోట్లకు (90 బిలియన్ డాలర్లు) పరిమితమైంది. దీంతో అంబానీ కంటే ఏకంగా రూ. 59,400 కోట్ల ఆధిక్యంతో అదానీ మొదటి స్థానంలో నిలిచారు.

**దేశ సంపదలో సగానికి సమానం..**

భారతదేశంలో సంపన్నుల సంఖ్య ఏటా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. తాజా జాబితాలో కనీసం రూ. 1,000 కోట్ల సంపద కలిగిన వ్యక్తులు 1,810 మందికి చేరారు. వీరి మొత్తం సంపద విలువ 12.8 శాతం ఎగబాకి ఏకంగా రూ. 187.5 లక్షల కోట్లకు (1.96 ట్రిలియన్ డాలర్లు) చేరింది. ఇది దాదాపు భారతదేశ జీడీపీలో సగానికి సమానం కావడం విశేషం. దేశంలో డాలర్ -- బిలియనీర్ల సంఖ్య సరికొత్త గరిష్ఠమైన 391కి చేరుకుంది. గత ఏడాది కాలంలోనే కొత్తగా 27 మంది ఈ క్లబ్‌లోకి అడుగుపెట్టారు.

**టాప్ 10లో అనూహ్య మార్పులు..**

మెటల్, స్టీల్, ఫార్మా రంగాలు ఈసారి అద్భుత పనితీరు కనబరిచాయి. ఆర్సెలర్ మిట్టల్ అధినేత ఎల్.ఎన్.మిట్టల్ సంపద 93 శాతం వృద్ధితో రూ. 3.39 లక్షల కోట్లకు చేరి, మూడో స్థానానికి ఎగబాకింది. జాబితాలో అత్యధికంగా ఒక్క ఏడాదిలోనే రూ. 1.64 లక్షల కోట్ల సంపదను పెంచుకున్న వ్యక్తిగా ఆయన నిలిచారు. వేదాంత గ్రూప్ అనిల్ అగర్వాల్ కుటుంబం రూ. 2.08 లక్షల కోట్లతో 9వ స్థానానికి, జేబీ కెమికల్స్ విలీనంతో టోరెంట్ ఫార్మా సమీర్ మెహతా కుటుంబం రూ. 1.89 లక్షల కోట్లతో 10వ స్థానానికి దూసుకొచ్చాయి. సాంప్రదాయ వ్యాపారాలే కాకుండా అత్యాధునిక సాంకేతిక రంగాల నుంచీ యువ పారిశ్రామికవేత్తలు ఈ జాబితాలో మెరిశారు. బెంగళూరుకు చెందిన క్యూపీఐఏఐ వ్యవస్థాపకుడు నాగేంద్ర నాగరాజ రూ. 1,700 కోట్ల సంపదతో హురున్ లిస్ట్‌లోకి ప్రవేశించిన తొలి క్వాంటమ్ కంప్యూటింగ్ పారిశ్రామికవేత్తగా నిలిచారు. అలాగే ఏఐ ఆధారిత 'విస్పర్ ఫ్లో' కంపెనీ ద్వారా కేవలం 28 ఏళ్ల తనయ్ కొఠారి, సహజ్ గార్గ్ చెరో రూ. 4,200 కోట్ల సంపదతో ఎంట్రీ ఇచ్చి ఔరా అనిపించారు. క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'జెప్టో' కో-ఫౌండర్ కైవల్య వోహ్రా (23 ఏళ్లు) ఈ జాబితాలోనే అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించారు.

**మహిళల హవా.. ముంబై నంబర్ 1 నగరం..**

ఈసారి జాబితాలో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరిగి 131కి చేరింది. రూ. 2.79 లక్షల కోట్లతో రోష్ని నాడార్ మల్హోత్రా భారత అత్యంత ధనిక మహిళగా తన స్థానాన్ని నిలబెట్టుకోగా, అరిస్టా నెట్‌వర్క్స్‌కు చెందిన జయశ్రీ ఉల్లాల్ (రూ. 77,400 కోట్లు) స్వయంకృషితో ఎదిగిన నంబర్ 1 మహిళగా నిలిచారు. ఇక నగరాల విషయానికి వస్తే 465 మంది సంపన్నులతో దేశ ఆర్థిక రాజధాని ముంబై అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఢిల్లీ (236), బెంగళూరు (129) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. మొత్తంగా చూస్తే సంపద సృష్టిలో స్వయంకృషితో ఎదిగిన పారిశ్రామికవేత్తల వాటా 70 శాతానికి చేరడం భారత ఆర్థిక ప్రగతికి అద్దం పడుతోందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

# తగ్గిన బంగారం ధరలు..

బుధవారం పెరుగుదల నమోదు చేసిన బంగారం ధరలు గురువారం యూటర్న్ తీసుకున్నాయి . భారీ తగ్గుదల నమోదు చేశాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,52,680గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ. 1520 మేర తగ్గింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ. 1,39,950గా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ. 1400 మేర తగ్గింది. మరోవైపు వెండి ధరలు కూడా భారీ తగ్గుదల నమోదు చేశాయి. వెండి ధర కిలోకు రూ. 5 వేల మేర తగ్గింది. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ. 2.45 లక్షలుగా ఉంది.





# గ్యాస్ సిలిండర్ ధరలు ఇవే!

ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ. 2,996గా ఉంది. ఇదిలా ఉంటే.. గత నెల(ఆగస్టు)తో పోలిస్తే గృహ వినియోగ ఎల్‌పిజి ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ప్రస్తుతం(సెప్టెంబర్ 24) రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**ఏపీ, తెలంగాణలో గ్యాస్ సిలిండర్ ధరలు**

హైదరాబాద్: రూ. 994.00
వరంగల్: రూ. 1013.00
విశాఖపట్నం: రూ. 950.00
విజయవాడ: రూ. 966.50
గుంటూరు: రూ. 966.50

# పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ ధరలు

ఈ నెల(సెప్టెంబర్) 1వ తేదీ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గుతాయెమో అని వాహనాదారులు ఆశ పడ్డారు. కానీ వారికి నిరాశే మిగిలింది. ఈ తరుణంలో ఇవాళ(గురువారం) పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవు. హైదరాబాద్‌లో ప్రస్తుతం పెట్రోల్ ధర లీటరుకు రూ. 116.15గా ఉంది.

**సీఎన్‌జీ ధరలు..**

గత ఆగస్టు నెలతో పోల్చితే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ ధరల్లో కూడా ఎలాంటి మార్పులు లేవు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ప్రస్తుతం కిలో సీఎన్‌జీ గ్యాస్ ధరలు హైదరాబాద్‌లో రూ. 112.00, వరంగల్‌లో రూ. 110.00, విశాఖపట్నంలో రూ. 99.80, విజయవాడలో రూ. 103.00గా ఉన్నాయి.






# టెస్ట్‌కు రెడీ అయిన కార్తీక్ సుబ్బరాజ్

కోలీవుడ్ స్టార్ దర్శకుల్లో ఒకరైన కార్తీక్ సుబ్బరాజ్ సక్సెస్ ట్రాక్ గాడి తప్పేసింది. గత ఏడాది గేమ్ ఛేంజర్‌కు స్టోరీ ఇచ్చి రామ్ చరణ్ ఇమేజ్ డ్యామేజ్‌కు కారణమయ్యాడు. సూర్యతో రెట్రో తీసి తమిళ తంబీల అసంతృప్తికి గురయ్యాడు. అందుకే ఈ సారి స్టార్స్‌ని పక్కన పెట్టి రైజింగ్ హీరోలతో ఆడియన్స్ టెస్ట్‌కు రెడీ అయ్యాడు. గేమ్ ఛేంజర్, రెట్రో సినిమాల రిజల్ట్ తర్వాత కార్తీక్ సుబ్బరాజ్‌ను పట్టించుకోవడం మానేశారు స్టార్స్. దీంతో డైరెక్షన్ డిపార్ట్ మెంట్‌కు కాస్త గ్యాప్ ఇచ్చి.. నిర్మాతగా ఏదో ప్రయత్నాలు చేశాడు కానీ అదీ కూడా వర్కౌట్ కాలేదు. దీంతో మళ్లీ మెగా ఫోన్‌పై ఫోకస్ చేసి డోరతి మూవీని తెరకెక్కించాడు.కీర్తి సురేష్ హీరోయిన్‌గా సనంద్, రిషికాంత్ లీడ్ రోల్స్‌లో నటించిన డోరతి సెప్టెంబర్ 25న రిలీజ్ కాబోతోంది. ఈ మూవీకి ఇళయ రాజా మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇటీవల టొరంటో ఫిల్మ్ ఫెస్టివల్లో ప్రదర్శితమైంది డోరతి. సుబ్బు, కార్తీ జీవితాల్లో డోరతి వల్ల ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయో ఈ మూవీ ద్వారా చూపించబోతున్నాడు కార్తీక్ సుబ్బరాజ్. అట్లీ, లోకేశ్ కనగరాజ్ లాంటి స్టార్ డైరెక్టర్స్ బన్నీని లైన్లో పెడుతుంటే.. కార్తీక్ సుబ్బరాజ్ మాత్రం హీరోల కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి. అప్పుడెప్పుడో ఇండిపెండెంట్ సినిమా తీస్తానని చివరకు డోరతి తెస్తున్నాడు. నెక్స్ మలయాళ సినిమా ప్లాన్ చేస్తున్నాడట. రియల్ లైఫ్ స్టోరీ ఆధారంగా తెరకెక్కిస్తానని రీసెంట్లీ వెల్లడించాడు కార్తీక్. ఇవన్నీ సరే.. కార్తీక్ డోరతితో హిట్ కొట్టి.. మళ్లీ స్టార్ హీరోల అటెన్షన్ గ్రాబ్ చేస్తాడో లేదో..?

# మహేశ్ బాబు న్యూ లుక్ పోస్ట్ వైరల్



సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా దర్శకధీరుడు SS రాజమౌళి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ కీలక దశకు చేరుకుంది. దాదాపు రెండేళ్లుగా వారణాసి చిత్రానికే అంకితమైపోయిన మహేశ్ బాబు తన పాత్ర షూటింగ్‌ను చిత్రంలో ఇంట్రడక్షన్ సీన్లో వచ్చే షాట్‌తో తాజాగా ముగించారు. షూటింగ్ పూర్తి చేయడంతో పాటు ఇప్పటికే డబ్బింగ్‌ను కూడా ప్రారంభించినట్లు సమాచారం. 90%కు పైగా షూటింగ్ పూర్తవగా, మిగిలిన ప్యాచ్‌వర్క్‌ను వారణాసిలో పూర్తి చేసి షూటింగ్‌కు గుమ్మడికాయ కొట్టేందుకు టీమ్ సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. మహేశ్ బాబు ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఇక షూటింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో VFX, ఎడిటింగ్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ వంటి పోస్ట్ ప్రొడక్షన్ పనులపై రాజమౌళి ఫోకస్ పెట్టనున్నారు. కాగా.. సైన్స్ ఫిక్షన్ అండ్ హిందూ మైథాలజీ కలగలిపిన గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్ర పోషిస్తున్నాడు. ఎం.ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నాడు. ప్రపంచస్థాయి విజువల్స్‌తో వారణాసి చిత్రం ఏప్రిల్ 7, 2027న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.




# ఫైనల్‌గా అఫీషియల్ అప్డేట్ ఇచ్చిన ధనుష్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నుంచి వస్తోన్న మరో క్రేజీ ప్రాజెక్ట్ 'ఓమ్'. 'అమరన్' ఫేమ్ డైరెక్టర్ రాజ్‌కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది దసరా కానుకగా అక్టోబర్ 16న విడుదల కాబోతున్నట్లు ఇప్పటికే టీమ్ ప్రకటించారు. కానీ ఈ సినిమా అనుకున్న టైమ్‌కు రావడం లేదని, వాయిదా పడుతుందని గత కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా దీనిపై స్పందిస్తూ అఫీషియల్ అప్డేట్ ఇచ్చాడు ధనుష్. ఈ మేరకు తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా ఓ కీలక నోట్ షేర్ చేస్తూ.. 'ఎన్నో ఏళ్లుగా మనమందరం ఎంతో గౌరవించే, ఆరాధించే సూపర్ స్టార్ రజినీకాంత్ గారి చిత్రం 'జైలర్-2', మా సినిమా విడుదలకు సరిగ్గా ఒక్క రోజు ముందు, అంటే అక్టోబర్ 15న విడుదల కానుంది. ఆయన పట్ల ఉన్న అపారమైన గౌరవంతో, మా చిత్రం 'OM' విడుదలను మరో తేదీకి వాయిదా వేయాలని నిర్ణయించుకున్నాము. అలాగే.. ఈ ఏడాది దీపావళికి కూడా మేము మా చిత్రాన్ని విడుదల చేయడం లేదు, ఎందుకంటే అదే తేదీకి సూర్య గారి చిత్రం విడుదల కానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. వాస్తవానికి, వారు తమ విడుదల తేదీని ముందుగానే ప్రకటించారు. సినిమా అండ్ పరిశ్రమ శ్రేయస్సను దృష్టిలో ఉంచుకుని, పెద్ద చిత్రాల మధ్య పరస్పర అవగాహన ఉండాలని, ఒకరి నిర్ణయాలను మరొకరు గౌరవించుకోవాలని మేము బలంగా విశ్వసిస్తున్నాము. అందుకే మా సినిమాను వాయిదా వేస్తున్నాము. త్వరలోనే మా సినిమా కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాము' అని తెలిపాడు.




# ఇట్స్ అఫీషియల్..

టాలెంటెడ్ హీరో శర్వానంద్ హీరోగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జార్జ్‌క్రిష్' చిత్రంలో హీరోయిన్‌గా మానస వారణాసి ఎంపికైనట్లు మేకర్స్ ప్రకటించారు."ఒక రిఫ్రెషింగ్ కపుల్‌ను రాబోయే సంక్రాంతి స్పెషల్ ఎంటర్‌టైనర్‌లో బిగ్ స్క్రీన్‌పై చూసేందుకు సిద్ధంకండి" అంటూ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శ్రీను వైట్ల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర, అనిల్ సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఫుల్ లెంత్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది పొంగల్ కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు.

# సిగ్గుగా అనిపించింది..

నాలుగు రోజుల పాటు ఇంటి నుంచి కాలు బయటపెట్టలేకపోయానని ఎమోషనల్ అయ్యారు. ఆ లీక్ కారణంగా తన వ్యక్తిగత జీవితం ఎంతగా ప్రభావితమైందో చెబుతూ.. తన స్టైలిస్ట్ డ్రైవర్ ఆ వీడియోను చూసి తనను విచిత్రంగా చూడటం, అపార్ట్‌మెంట్ వాచ్‌మ్యాన్ కూడా దాని గురించి మాట్లాడటం తనను తీవ్రంగా భయపెట్టాయని చెప్పారు.ఒంటరిగా అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న ఆ సమయంలో డోర్‌బెల్ మోగితే ఎవరో విమర్శించడానికి వస్తున్నారేమోనన్న టెన్షన్‌తో గడిపినట్లు తెలిపారు. ఆ క్లిష్ట సమయంలో తన డ్రైవర్, స్పాట్ బాయ్‌ను పిలిచి పరిస్థితిని వివరించి, మీకు అభ్యంతరం లేకపోతేనే నన్ను రక్షించండి అంటూ ధైర్యంగా మాట్లాడానని, వాళ్ళు తోడుగా నిలవడంతోనే తనకు భద్రతా భావం కలిగిందని రాధిక గుర్తు చేసుకున్నారు. అలాగే, కేవలం వ్యక్తిగత విషయాలే కాకుండా.. ఒకసారి తన కుటుంబానికి ప్రమాదం జరుగుతుందనే భయంతో తాను నిజంగా చేయాలనుకున్న ఓ మంచి ప్రాజెక్ట్‌ను కూడా వదులుకోవాల్సి వచ్చిందని చెప్పారు. జీవితంలో ఎప్పుడూ భయంతో నిర్ణయాలు తీసుకోని తాను, ఆనాడు అలా చేయడం చాలా సిగ్గుగా అనిపించిందని తెలిపారు.






# నాని "ప్యారడైజ్" సినిమాలో కేసీఆర్..

నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన ది ప్యారడైజ్ సినిమా బుధవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. బుధవారం రాత్రి ప్రీమియర్స్ వేయగా గురువారం ఉదయం నుండి పాన్ ఇండియా లెవల్‌లో విడుదల చేశారు. సినిమాకు ఎక్కడ చూసినా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. సినిమాలో యాక్షన్ సన్నివేశాలు, తల్లి సెంటిమెంట్ ఎంతగానో ఆకట్టుకున్నాయని ప్రేక్షకులు చెబుతున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని సన్నివేశాలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఓ సన్నివేశంలో ఎమ్మెల్యే శంకర్ అన్న అనే పాత్ర అచ్చం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పోలి ఉండటం ఆసక్తికరంగా మారింది.ప్రియదర్శి ఈ పాత్రలో నటించగా మాట్లాడే విధానం, ఆయన లుక్ కేసీఆర్‌ను పోలి ఉన్నాయి. దీంతో కేసీఆర్ రిఫరెన్స్ తోనే ఈ పాత్రను రూపొందించి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అంతేకాకుండా ఈ పాత్ర సినిమాలో ఎంతో కీలకమైనదిగా తెలుస్తోంది. సినిమాలో ఓ సన్నివేశంలో గద్దర్‌కు సంబంధించి కూడా సన్నివేశాలు ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు దివంగత నేత ఎన్టీరామారావు పాత్ర కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. పారడైజ్ సినిమా తెలంగాణలోని గోదావరిఖని నేపథ్యంలో వచ్చిన సంగతి తెలిసిందే. చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ఇందులో నానికి జోడిగా కాయదు లోహర్ హీరోయిన్ గా నటించింది. కీర్తి సురేష్ సినిమాలో స్పెషల్ సాంగ్ తో అదరగొట్టింది.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**